
A-000458
173



# THE ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES.

## OFFICIAL REPORT

*Fifty-fourth day of the First Session of the Andhra Pradesh Legislative Assembly.*

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Friday, the 15th September, 1967.

The House met at Half Past Eight of the Clock.

*[Mr. Speaker in the Chair]*

### CONDOLENCE MOTION

*re* :DEMISE OF DR. B. RAMAKRISHNA RAO

Mr. Speaker :— Hon. Members, I am sorry to inform the House about the demise of Sri B. Ramakrishna Rao in the early hours of today. Most of you would have heard in the Radio, this morning, that he expired in the early hours of to day. Now the Chief Minister will move the condolence motion.

The Chief Minister (Sri K. Brahmananda Reddy) :— Sir, I beg to move the following condolence motion:

"That this House places on record its deep sense of sorry at the demise of Sri B. Ramakrishna Rao, former Chief Minister of Hyderabad and conveys its deep sense of sympathy to the Members of thc bereaved family."

Mr. Speaker :— Motion moved.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి : — అధ్యక్షా, ఆంధ్ర దేశానికేగాక భారత దేశానికి కూడ పరిచితులైన, పూజ్యులు, పెద్దలు శ్రీ రామకృష్ణారావు గారు యీనాడు తెల్లవారుజామున సుమారు 1.05 గంటలకు మరణించారు. రామకృష్ణారావుగారి జీవిత చరిత్ర గురించి గౌరవ సభ్యులందరికీ తెలుసు. మంత్రిగా హైదరాబాదు స్టేటుకు ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ కు గవర్నరుగా, కేరళకు గవర్నరుగా, తరువాత, రాజ్యసభ సభ్యులుగా వారు యీ రాష్ట్రంలో,

దేశంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిన సంగతి అందరికీ విదితమే. వారికి సుమారు 69 సం॥ లు వయస్సు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి తాలూకాలో జన్మించారు. చాలకాలం ప్రాక్టీసు చేశారు. మొట్టమొదటినుంచీ నేషనలిస్టు మూమెంటుతో సంబంధం కలిగి ఇక్కడ ఇదివరకు వుండే హైదరాబాదు స్టేటులో అనేక రంగాలలో ప్రముఖ పాత్రను తీసుకున్న సంగతికూడ మీ అందరికీ తెలుసు. ప్రప్రథమంగా ఇక్కడ రజాకారుమూమెంటు పోలీసు యాక్షను, వగైరాలు అయిపోయిన తరువాత, వెల్లోడి రాజ్యములో వారిని మంత్రిగా తీసుకోవడం జరిగిది. రెవిన్యూ మంత్రిగాను, విద్యాశాఖ మంత్రిగాను వారు వున్నారు. వారు మంత్రిగా—ముఖ్యంగా ముఖ్యమంత్రిగా వున్న కాలంలోనే తెలంగాణా ప్రాంతములో లాండ్ రిఫారమ్స్ చేసి ఇక్కడ రైతాంగానికి ముఖ్యంగా భూమి దున్నుకునేవారికి ఎక్కువ సౌకర్యాలు కలిగించిన సంగతి మీ అందరికీకూడా తెలుసు. ఆయన మంచి స్కాలర్. అనేక భాషలు ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, తెలుగు, మరాటీ-ఇంకా అనేక భాషలలో కూడ వారు గొప్ప స్కాలర్ అని మనవి చేస్తున్నాను. వారు చాల చాకచక్యముగా, టాక్ట్‌ఫుల్‌గా, హైదరాబాదు రాష్ట్రములో కాంగ్రెసుకు చాల స్వల్ప మెజారిటీ వున్నప్పటికీ యీ రథాన్ని ఎంతో జాగ్రతగా నడిపి, ఎన్నో సంస్కరణలకు కారకులయ్యారు. వారు మంత్రి అయిన తరువాతనే వారి విషయం మాకు ఎక్కువగా తెలుసుకోడానికి అవకాశం కలిగింది. అందులో ముఖ్యంగా హైదరాబాదు రాష్ట్రం విభజించడానికి - ఆంధ్రప్రదేశ్ అనే ఎన్‌లార్జ్‌డ్ స్టేటు ఏర్పడడానికి ముఖ్యకారకులనే విషయం నిర్వివాదమని మనవిచేస్తున్నాను. వారితో గత 11-12 సంవత్సరాలుగా నాకు ఎంతో సన్నిహిత సంబంధం వుంది. వారి సలహాలను తీసుకునే అవకాశం వుండినది. వారిదగ్గర నేర్చుకోవలసిన కొన్ని విషయాలుకూడ నేర్చుకోడానికి అవకాశం దొరికింది. ఏమి వున్నప్పటికీ ప్రభుత్వ కార్యకలాపాలు జరపడములోగాని, శాసనసభా కార్యకలాపాలు జరపడములోగాని ఆయనకు మించిన చేయి లేదని నేననుకుంటున్నాను. అంత నేర్పరి, అంత చక్కగా స్నేహితులను రాబట్టుకుని వారితో negotiate చేసి చక్కని మాటలను చెప్పి మంచి సమర్థతతో నడిపిన పెద్దలు అని నేను మనవి చేస్తున్నాను. అపుడు ఉంటున్న literary movements లోను ఇతర movements లోను అన్నిటిలోను భాగస్వామిగా ఉన్నారు. ఆంధ్ర మహాసభ కార్యకలాపాలకు ఎక్కువగా దోహదం చేసినారు. ఏమైనప్పటికి హైదరాబాదు రాష్ట్రంలోను enlarge అయిన ఆంధ్రప్రదేశ్‌లోను మొత్తం భారతదేశంలోని ప్రముఖ నాయకులలో ఒకరు అని మనం చెప్పుకోవలసివస్తుంది. సుమారు రెండు సంవత్సరాల

క్రిందట వారికి ఒకసారి heart attack రావడం జరిగింది. అదృష్టవశాత్తు దేవుని దయవలన దానిని తట్టుకోగలిగారు. తరువాత ఏమీ ఇబ్బందిలేకుండా మామూలు కార్యకలాపాలు జరుపుతూ వచ్చారు. 28 ఆగస్టున మరల రావడంతో కొంచెం diabetic patient అవడం వలన కొన్ని complications వచ్చాయి. ఇప్పుడే వారి భౌతిక దేహానికి నమస్కరించివచ్చాను. Kidney కూడా fail అయినది. దానితో ఆయన ఉదయం 1-05 నిముషాలకు స్వర్గస్థులైనారు. నేను వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబానికి మనయొక్క సానుభూతి తీర్మానాన్ని అందజేస్తూ భగవానుడు వారి ఆత్మకు శాంతి కలిగించాలని కోరుతూ విరమిస్తున్నాను.

శ్రీ బి. రత్నసభాపతి (రాజంపేట) :— అధ్యక్షా, ఈ రోజు ప్రొద్దుట పేపరులో చూచిన వార్త మనకేగాక ఆంధ్రదేశం మొత్తానికి దిగ్భ్రమ కలిగించేది పిడుగు వంటి వార్త, ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు, రామకృష్ణారావుగారు హైదరాబాదు రాష్ట్రంలో నైజాం ప్రభుత్వాన్ని ఏ విధంగా ఎదుర్కొని ఆంధ్ర మహాసభను ఒక పటిష్ఠమైన ఉద్యమంగా తయారుచేసినది మనకు తెలుసు. తరువాత హైదరాబాదు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి feudal దశనుంచి ప్రజాస్వామిక వ్యవస్థకు ఈ రాష్ట్రాన్ని తీసుకురావడానికి మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రజలలో ఏ విధమైన మార్పు తెచ్చినది మనకు తెలుసు. వారు చెప్పినట్లు, ఆయన కేవలం ఒక administrator మాత్రమేకాదు ; బ్రహ్మాండమైన scholar, ఈ రోజు వారు మృతిచెందడంవల్ల రాజకీయంగా మనకువచ్చే నష్టమే కాకుండా వైజ్ఞానికంగాను విద్యారంగంలోను ఒక బ్రహ్మాండమైన వ్యక్తిని మనం పోగొట్టుకున్నాము. వారు ఉత్తరప్రదేశ్‌లోను, కేరళలోను గవర్నరుగా ఎటువంటి పరిస్థితులలోను చాల చక్కగా పనిచేసుకుని క్లిష్ట సమస్యలకు ఎలాంటి విధంగా solution తెప్పించారో మనకు తెలుసు, అలాంటి వ్యక్తి ఈ రోజు గతించారంటే ఆంధ్రప్రదేశ్‌కేకాదు, యావద్భారత దేశానికి తీరని కొరత, మొన్న మొన్ననే లచ్చన్నగారు వారు ఆస్పత్రిలో ఉంటే చూసి పరామర్శ చేయడానికి వెళ్లారు. వారిని చూడడానికి అవకాశం లేకపోయింది కాని వారు కోలుకుంటున్నారని, ఆరోగ్యం బాగుపడుతోందని చెప్పిన తరువాత అందరూ చాలా సంతోషించారు. వారి విజ్ఞానం, వారి విద్య, తెలివి తేటలు భారత దేశానికి ఆంధ్రదేశానికి ఉపయోగకరంగా ఉంటాయని ఆశించాము. కాని దేవుని నిర్ణయం మరొక విధంగా జరిగింది, కనుక ఈ రోజు ముఖ్యమంత్రిగారు వెలిబుచ్చిన భావాలతో ఏకీభవిస్తూ వారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయ పూర్వకంగా బలపరుస్తున్నాను.

Sri S. Vemayya (Sarvepalli) :— Mr. Speaker Sir, I beg to associate myself with the sentiments expressed by the Chief Minister. Much has been said by him and as politician, administrator, author and Governor he proved to be an effective leader. I, therefore, once again, associate myself with the sentiments expressed by the Chief Minister and resume my seat.

శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు (సిరిసిల్ల):— అధ్యక్షా, హైదరాబాదు రాష్ట్రంయొక్క రాజకీయ చరిత్రలో చాలామంది ప్రముఖులు తమ తమ స్థానాలను అలంకరించారు. అందులో అగ్రగణ్యులు కీర్తిశేషులైన బూర్గుల రామకృష్ణారావుగారు అని చెప్పడంలో సందేహం లేదు. వారు అడ్వకేటుగా ఉండి మంచి అడ్వకేటుగా రాణిస్తూ పైకివచ్చే రోజులలోనే అప్పటి రాజకీయ వాతావరణంలో వారు ఆంధ్రమహాసభలో పాల్గొని చాలా చాకచక్యంగా యుక్తితో కూడిన పద్ధతులతో ఎటువంటి కఠిన రాజకీయ పరిస్థితులలోను ప్రజల యొక్క సేవచేయడానికి ప్రజాస్వామ్య ఉద్యమాన్ని పైకి తేవడానికి స్వతంత్ర ఉద్యమానికి దోహదం చేయడానికి చాలా పట్టుదలతో పనిచేశారు. హైదరాబాదు రాష్ట్రం విడిపోయి ఏ ఏ రాష్ట్రాలలో సంలీనం కావాలనే సమస్య వచ్చినపుడు వారు నిర్వహించిన పాత్ర చాలా ఘనమైనదని చెప్పుకోవలసి ఉంటుంది. హైదరాబాదు శాసనసభ ఏర్పడి ప్రజాస్వామిక పద్ధతి సాగించాలి అన్నపుడు అంతకుముందు ప్రజాస్వామిక సాంప్రదాయాలంటూ లేని రోజులలో శాసనసభా సాంప్రదాయాలు, కార్యక్రమాలు ప్రాథమిక దశనుంచి ప్రారంభించినపుడు అత్యంత చాకచక్యంగా అద్భుతమైన నేర్పరితనంతో పార్లమెంటరీ డెమాక్రసీని నడిపించడంలో వారిది ప్రముఖబాధ్యత. ఆంధ్రప్రదేశ్ లో వారు తమ స్థానాన్ని అలంకరించి యావద్భారతదేశంలోను ప్రముఖ రాజకీయనాయకుడుగా పేరు పొందారు. బూర్గుల రామకృష్ణారావుగారు అస్తమయం కావడం గత 25 సంవత్సరాలలోను ఏదో ఒక పద్ధతిలో ఏదో ఒక సంబంధం కలిగి రాజకీయాలలో పనిచేసిన మావంటివారికి తీరని లోటుగా భావిస్తాను. మా పార్టీ తరఫున వారి కుటుంబానికి సంపూర్ణమైన సానుభూతి తెలుపుతూ ముఖ్యమంత్రిగారు వెలిబుచ్చిన భావాలతో నేను ఏకీభవిస్తున్నాను.

శ్రీ బి. నరసింహారెడ్డి (కొల్లాపూరు):— అధ్యక్షా, విషాదకరమైన వార్త వచ్చింది. దిగ్భ్రాంతుడనైనాను. వారి ఆరోగ్యం అంతగా బాగ్గాలేదనే విషయం నాకు తెలుసుకాని ఇటీవల చికిత్సవల్ల కొంత పరిస్థితి మెరుగు అయినదని విన్నాము. ఇపుడు ఈ వార్త ఆకస్మికంగా విన్నాము. ఇది ఎంతో విషాదకరమైనది. మన రాష్ట్రానికి ఎంతో లోటు ఏర్పడినది. నేను వారికంటె ఎంతో

చిన్నవాణ్ని అయినా రాజకీయాలలో వారితోకలిసి పనిచేసే అవకాశం కలిగింది. ఆంధ్రమహాసభ కాలంలో మా రాజకీయజీవితం ఆరంభదశలో నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ తల ఎత్తిన రోజులలో మేము అందరము ఆంధ్రమహాసభలో కలిసి పనిచేసిన చరిత్ర ఉన్నది. ఆయన ఆంధ్రమహాసభ సారథులలో ఒకరుగా ఉన్నారు. ఆంధ్రమహాసభ అధ్యక్షులుగా ఒకసారి ఉన్నారు. ఆ కాలంలోనే వారు మాకు తెలిసినటువంటి భారతదేశ మేధావులలో ఒకరుగా మేము ఎంచుతూ వుండేవారము. ఎందుకంటే వారు పెద్ద పండితులుగా, విజ్ఞానవంతులుగా ముందుకు వచ్చారు. తరువాత సత్యాగ్రహ పోరాటంలోకూడా, నైజాం వ్యతిరేక సత్యాగ్రహ పోరాటంలో పాల్గొన్నారు. అంతకు పూర్వం స్టేటు కాంగ్రెసు సత్యాగ్రహ ఉద్యమంలోకూడా పాల్గొన్నట్లు నాకు జ్ఞాపకం. అన్నింటికంటె క్లిష్టసమస్య విశాలాంధ్ర కావాలనేది. విశాలాంధ్ర కావాలనడం ఒకరకంగా మనకందరికి అతి సామాన్యమైన కనీస వాంఛగా వున్నప్పటికీ, ఈనాడు సిద్ధించిన వాంఛ అయినప్పటికి దానిని బలపరచడమే తెలంగాణాలో క్లిష్టసమస్యగా వుండె. అందులో పాలకులుగా వున్నవారికి క్లిష్టసమస్యగా వుండిన రోజులలో నిర్ద్వంద్వముగా విశాలాంధ్ర కావాలని చాలా స్పష్టముగా వెల్లడి చేసినటువంటి ప్రముఖులలో వీరు ఒకరు. పత్రికలలో వార్తలు విన్నప్రకారం మొత్తం విశాలాంధ్ర కావాలా లేక తెలంగాణా స్టేటు అలాగే వుండాల అనే విషయం నిర్ణయించే సమావేశంలో విశాలాంధ్ర కావాలనే వాదాన్ని చాలా సమర్థనీయంగా చేయగలిగారు. ఆ కారణంవల్ల కీర్తిశేషులు పంతుగారు వీరిని అభినందించారు అనికూడా మేము విన్నాము. విశాలాంధ్ర సాధించడంలో ప్రముఖపాత్ర నిర్వహించారని చెప్పవచ్చు. ఈనాడు ఆంధ్రప్రదేశ రాష్ట్రంగా మనం యేర్పడి వున్నామంటే ఆంధ్రప్రదేశ అసెంబ్లీలో సహజముగా యీ ఆంధ్రప్రదేశంయొక్క రాష్ట్రం స్థాపించడంలో చాలా ప్రముఖపాత్ర వహించినవారు మరణించడం ఎంతయినా విచారకరమైన, దుఃఖకరమైన విషయమని అనడానికి సందేహం లేదు. అలాగే వారు తెలంగాణా పోరాటం అనంతరం హైదరాబాదు ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా వున్నట్టువంటి కాలంలో అనేక న్యాయమైన రైతుకూలీల కోర్కెలను, ఉద్యమ ఆశయాలను ఒకరకంగా వారి విధానంలో ప్రతిబింబించాయని మేముకూడా భావిస్తున్నాము. వారు తెచ్చిన కౌలుదారీ రక్షణచట్టం వాస్తవంలో మావుద్దేశ్య ప్రకారం యెన్ని పరిమితులున్నప్పటికికూడా అది ఆనాడు కౌలుదారీ రైతాంగ వుద్యమంలో న్యాయమైన కోర్కెలను రక్షించుకోవడంలో ఆ చట్టంలో అనేక అంశాలు తోడ్పడ్డాయని మనవి చేయవలసి వుంటుంది. తర్వాత కాలంలోకూడా

భారతదేశంయొక్క సారథ్యంలో ప్రముఖపాత్ర నిర్వహించారని మన ముఖ్య మంత్రిగారు తెలిపిచ్చారు. అది వాస్తవం. ఇవ్వాళ యిలాంటి మేధావులు మనకు పోవడం యీ దేశానికి పెద్ద లోటు అనడంలో సందేహం లేదు. వారు పోవడం వల్ల మనం ఒక మేధావిని, విజ్ఞానవంతుని, పండితుని, ఆంధ్ర సారస్వతంలో అగ్రశ్రేణికి చెందిన వ్యక్తిని కోల్పోయామని భావిస్తున్నాను. వారి కుటుంబానికి నాయొక్క సానుభూతి తెలియపరుస్తున్నాను.

డాక్టర్ టి. యస్. మూర్తి (వరంగల్లు) :—అధ్యక్షా, శ్రీబూర్గుల రామకృష్ణా రావుగారు నిన్న కోలుకుంటున్నారనే వార్త విని చాలా సంతోషించినాము. హఠాత్తుగా యివ్వాళ వారు స్వర్గస్థులయినారని విని చాల విచారసాగరంలో మునిగిపోయాము. అనేక సంవత్సరాలు వారితో కలిసి పని చేశాను. వారు మేధావులు, బహుభాషా కోవిదులు, విజ్ఞానవంతులు, గంభీర రాజనీతిజ్ఞులు. అటువంటి మహానుభావుని తెలంగాణాగాని, ఆంధ్రప్రదేశ్‌గాని, భారతదేశం గాని తిరిగి పొందలేదని నా ఉద్దేశ్యము. అటువంటి మహానుభావుడు ఆయన. ఇప్పుడు నరసింహారెడ్డిగారు చెప్పినట్లు విశాలాంధ్ర కావాలని యిక్కడ వారు అడుగుతున్న రోజులలో విశాలాంధ్ర కావాలని అనడమే మహా పాపంగా బజారులోపడి తిడుతున్న రోజులలో దానికోసం గట్టిగా నిలబడి ఆయన తీసుకున్న రిస్కు అర్థం చేసుకుంటే ఆయన సన్నిహితులను విడనాడి విశాలాంధ్రకోసం యేకకంఠంతో నిలబడి తన కన్విక్షనుకోసము యేవిధముగా గట్టిగా నిలబడి పోరాడగలరో అర్థమవుతుంది. ఆంధ్రమహాసభ రోజులనుండి నాకు తెలుసును. ఆంధ్ర మహాసభలో వారు పని చేశారు. ఆంధ్ర మహాసభలో చీలికలు వస్తే నేషనలిస్టు పార్టీ పెట్టుకుని హైదరాబాదు కాంగ్రెసు స్థాపించడం సహచరులతో కలిసి 47-48 లో జరిగిన పోరాటంలో పాల్గొనడం ముఖ్యమంత్రిగా లెజిస్లేచరును చాకచక్యంగా నడిపించడం చరిత్ర అందరికి తెలుసును. మొట్టమొదటనుంచి రాజనీతిజ్ఞులు. కరడుగట్టిన భావాలు గలవారుకారు. కాలానుగుణంగా మార్చుకోగలిగిన శక్తి వారికి వుంది. కాకపోతే భారతదేశంలో మొట్టమొదటి సారిగా ప్రొటెక్టెడు టెనెన్సీ ఆక్టును, సీలింగు ఆక్టును తేవడం సంభవించేది కాదు. అటువంటి చట్టాలను తెచ్చిన మహానుభావుడు శ్రీ రామకృష్ణారావుగారు. అటువంటి మహానుభావుని మనం కోల్పోవడం చాలా విచారకరం. వారు లేని లోటు భర్తీచేయడం చాలా కష్టమని మనవి చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు తెలిపిన భావాలతో యేకీభవిస్తున్నాను. వారి కుటుంబానికి మా పార్టీ తరపున, వ్యక్తిగతంగాను సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు పరమేశ్వరుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ జి. బి. అప్పారావు (జామి) :—అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు సహజ శక్తిసంపన్నులు, సహృదయులు, సర్వజ్ఞులు. దురదృష్టవశాత్తు దేశం అతనిని కోల్పోయింది. దీనిగురించి యీ నాడు ఆంధ్ర దేశంలో ఉన్నటువంటి సామాన్య ప్రజానీకం తప్పనిసరిగా చాలా పరితప్త హృదయంతో ప్రతి ఒక్కరు వుంటారని నేను ఊహిస్తున్నాను. ఎందుకంటే ఆయన ఉన్నతశ్రేణికి చెందినటువంటి ఒక మేధావి. అంతేకాదు, ఆయన త్యాగమూర్తి. అంతేకాదు, సమస్త శాస్త్ర ప్రజ్ఞాధురీణులు. అట్లాంటి మహా నాయకులు యీనాడు మనలో లేడు. ఆయన అగ్రశ్రేణికి చెందిన పరిపాలనా దక్షులలో ఒకరు. త్యాగమూర్తులలో ఒకరు. నిజానికి ఇవ్వాళ నేను ముఖ్యంగా ప్రత్యేకించి బాధపడేది ఒకటి, అధ్యక్షా తమకు తెలియని విషయం కాదు. తండ్రి సొత్తు సంపాదిస్తే కొడుకులు ఖర్చుపెడుతూ వుంటారు. తండ్రి సంపాదించలేక పోతే కొడుకులు ఖర్చుపెట్టడానికి అవకాశం వుండదు. అట్లాగే కాంగ్రెసులో వున్నటువంటి త్యాగధనాన్ని సంపాదించినట్టి మహామహులలో ఒకరు. త్యాగం అనే ధనాన్ని అతను యెక్కడాకూడా దుర్వినియోగపరచుకోలేదు. ఆయన త్యాగధనాన్ని కాంగ్రెసు కుటుంబానికి అప్పచెప్పినటువంటి పెద్దలు, మహానుభావులు. ఇట్లాంటి వ్యక్తి యీనాడు మనలను విడిచిపోయినందుకు దేశం చాలా పరితప్తహృదయంతో వుందని చెప్పడంలో అసహజంకాని, అతిశయోక్తి కాని లేదు. ఆయన కీర్తిశేషులు ఆంధ్రకేసరి మహామహుడు ప్రకాశంపంతులు శ్రేణికి, కోవకు చెందిన మనిషి. అట్లాంటి దేశాభిమాని, పరిపాలనాదక్షుని, సహృదయుని, సర్వజ్ఞుని కోల్పోయినందుకు యీ నాడు యెంతో పరితపించు తున్నాము. అందుచేత ముఖ్యమంత్రిగారు చాలా పరితప్త హృదయంతో ప్రవేశ పెట్టిన యీ సంతాప తీర్మానంతో సంపూర్ణంగా ఏకీభవిస్తూ నా తరపున నా పార్టీ తరపున సానుభూతిని బాధను వారి కుటుంబానికి తెలియపరుస్తూ వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. మాధవరావు (నెల్లూరు):—అధ్యక్షా, బూర్గుల రామకృష్ణారావు గారి మరణానికి ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానాన్ని మా పార్టీ బలపరుస్తున్నది. వారు నాకు బాగా తెలుసు. రాజకీయవేత్తగానే వారిని చాలమంది చూసివుంటారు. ఆధ్యాత్మిక చింతన కల్గినవారు. పుట్టిన వారు గిట్టకమానరు అనే సూత్రాన్ని, భజగోవింద శ్లోకాలలో చెప్పిన సూత్రము యొక్క సారాంశాన్ని గ్రహించి దానిని అమలులోపెడుతూ, జీవితములో ఆధ్యాత్మిక చింతతో ముందుకు పోగల్గిన వ్యక్తులలో ఒకరు. అందువల్లనే వారికి మరణము అంటే భయము లేకుండా పోయి వుండవచ్చు అని అనిపిస్తున్నది.

ఆ సూత్రాన్ని అమలులో పెట్టి తాను ఒక జనకమహారాజుగానే వుండినారు కాని రాజకీయావేత్తగాగాని, మరొకవిధంగాగాని వుండలేదని తెలుసు. ఆదర్శ వ్యక్తి. ఆదర్శంకోసము జీవితము గడిపిన వ్యక్తి. వీరికి 69 సంవత్సరాలు. ప్రస్తుత పరిస్థితులలో అది అంత పెద్దవయస్సు కాదేమో అనుకొంటాను. వారి మరణము దేశానికి తీరని లోటు. వారు వకీలుగావున్నా, వదలిపెట్టి రాజకీయాలలో ప్రవేశించి దేశముకోసము ఏవిధంగా పాటుపడినారో ఆవిధముగానే మనం ఆదర్శ ప్రాయముగా వుండి నడచుకొన్ననాడే వారి ఆత్మకు శాంతిని కలుగచేసిన వారము అవుతాము అని మనవిచేస్తూ యీ తీర్మానాన్ని మా పార్టీ తరఫున మేము బలపరుస్తున్నాము.

శ్రీ కె. బుచ్చిరాయుడు (కొవ్వూరు):—అధ్యక్షా. భారతదేశములో అగ్రనాయకులలో ఒకరైన బూర్గుల రామకృష్ణరావుగారు పోవడము మనదేశానికి మన రాష్ట్రానికి చాలా నష్టము అని భావిస్తున్నాను. వారితో కొద్ది గంటలు కలిసి కూర్చునే భాగ్యము నాకు కల్గినది. నేను మద్రాసు లా కాలేజీలో చదువుకొనేటప్పుడు మా ఆంధ్రవిజ్ఞాన సమితి. వారిని ఆహ్వానించినది వారు అప్పుడు గవర్నరుగా వున్నారు. మద్రాసు లా కాలేజీలో అనేక భాషలు కల్గిన విద్యార్థులున్నప్పుడు వారి మధ్య ఈయన తెలుగు వారు అని చెప్పుకొని చాల గర్వపడినాము అని మనవిచేస్తున్నాను. అనేక భాషలు తెలిసిన విజ్ఞాన వంతులు. ఇటువంటి మహానుభావుడు చనిపోవడము మన దురదృష్టమని మనవి చేస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెల్పుతూ, వారి ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుని ప్రార్థిస్తూ శలవుతీసుకొంటున్నాను.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (సత్తెనపల్లి):—అధ్యక్షా, శరత్ కాలములో చెట్ల యాకులు రాలిపోయినట్లు మహోద్యమమైన జాతీయ ఉద్యమములోని అగ్రశ్రేణికి చెందిన మహానుభావులు ఒక్కరొక్కరే రాలిపోతున్నారంటే వసంతం వస్తోందనే ఆశవుంది. కాని నూతన యువకులు వస్తారు, నూతన రాజ్యము వస్తుంది. నూతన ఛాయలు వస్తాయి అనే ఆశ కన్పించడములేదు. ఇది పోతున్నందుకు చాల బాధగావుంది. నిన్న సాయంత్రము వారికి ఎట్లా వుందని తెలుసుకొంటే బాగానేవుందని అన్నారు. విశ్వనాథంగారు, నేను, ఇంకా మిత్రులము పోచంపాడు ప్రాజక్టుకు పోతూ దారిలో అనుకోన్నాము, తెల్లవారే టప్పటికి ఏ వార్త వింటామో అని. తెల్లవారి ఇక్కడకువచ్చి మూర్తిరాజు గారిని కలుసుకొనేటప్పటికి రేడియోలో వార్త విన్నారా అనిఅన్నారు. ఏ వార్త అని అంటే రామకృష్ణరావుగారు చనిపోయారని అన్నారు. వారు వారం, పది రోజులనుంచి పడిన బాధను చూసినపుడు ఆయన చనిపోవడము ఆయనకు,

చుట్టుప్రక్కలవారికి కొంత releief ఇచ్చినట్లుకన్పిస్తున్నది. కాని దేశానికితీరనిబాధ. ఈ శాసనసభలో మనము ఇలా కూర్చోడానికి అటు ఆంధ్రులుగాని, ఇటు తెలంగాణా వారుగాని సమిష్టిగానడిచి ఒక సంఘటనలోకి రావడానికి ఒక కీలకస్థానములో తీసుకొన్ననిర్ణయమే అసలు నిర్ణయము. చాల ధైర్యముతో ఆ నిర్ణయం తీసుకొన్న వ్యక్తి రామకృష్ణారావుగారు. ఆసమయములో నేనుఇక్కడ ఏదో ఏషియన్ కాన్ఫరెన్సు జరిగితే దానికి వచ్చి ఇక్కడ వుండడము తటస్థించినది. ఇప్పుడు రాజభవన్‌గావున్న బంగళాలో వారువుండేవారు. కేంద్రప్రభుత్వమునకు తెలంగాణాను ప్రత్యేకముగా వుంచితే బాగుంటుందనే అభిప్రాయము వుంది. ఇక్కడవున్న నాయకవర్గానికి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రముగా వుండాలని వుంది కాని సంతోషమైన విషయము ఏమిజరిగింది అంటే హైదరాబాదు రాష్ట్రముగా రద్దుకావాలని ఆయన చెప్పారు. ఆ నిర్ణయములో రాజకీయ దురంధరులు నేర్చుకోవలసిన విషయము ఎంతోవుంది "నేను హైదరాబాదు కాబినెట్ మనిషిని, హైదరాబాదు రద్దు అయిన తరువాత ఈ కాబినెట్ లేదు. కనుక నిర్ణయమునాది" అని అన్నప్పుడు "మీరు పెద్ద risk తీసుకొంటున్నారు. జాగ్రత్త ఆంధ్ర నుంచి వచ్చే వారు తెలంగాణా వారు కలిసేటప్పటికి మీరు ఏమి అవుతారో ఆలోచించుకోవాలి" అని పంత్‌గారు చెప్పడము జరిగింది. సుస్థిరతరావాలన్నట్లయితే ఆంధ్ర ప్రదేశ్‌ని నిర్ణయించడము తప్ప వేరే గత్యంతరము లేదని చెప్పారు. ఆంధ్ర ఏరియా నుంచి వచ్చిన నాయకులలో అభిప్రాయభేదాలున్నవి. ఇక్కడున్న వారిలో వున్నవి. విశాలాంధ్ర కావాలని హైదరాబాదు వచ్చి సజీవముగా తిరిగి వెడితే చాల గొప్ప అన్న మాట. ఆ పరిస్థితులు జ్ఞాపకము తెచ్చుకోడానికి కాదు. వాటిని పునశ్చరణ చేయాలని కాదు. ఒక్కడే ధైర్యముగా నిర్ణయము తీసుకొని విశాలాంధ్ర కావాలని అన్నారు. తెలంగాణా చరిత్రలో, అంధ్ర చరిత్రలో ఒక గమ్మత్తు జరిగింది. కవిగా పుట్టినవారు రాజకీయనాయకుడు అయినారు. రాజకీయనాయకుడుగా పుట్టినవారు కవిఅయినారు. తెలంగాణాలో మాడపాటి హనుమంతరావుగారు వున్నారనుకోండి వారి తరువాత తరములో వచ్చిన వారిలో సురవరం ప్రతాపరెడ్డిగారు, రామకృష్ణరావుగారే తెలంగాణా జీవితానికి భుజస్థంభాలు వంటి మనష్యులు. రామకృష్ణ రావుగారు తమ జీవితాన్ని కవిగా ప్రారంభంచేసినారు మొట్ట మొదట. ప్లీడరు అయినప్పటికి రాజకీయనాయకుడుగా ఈయన ఎవరికీ తెలియదు. మంచికవి రచయిత. సురవరం ప్రతాపరెడ్డిగారు రాజకీయనాయకుడుగా public field లోకివచ్చారు. కాని వారి జీవితము కవిగా అంతమైనది. ఇది వీరిద్దరి జీవితాలను ఆలోచించినపుడు తెసుస్తున్న విషయము. రామకృష్ణరావుగారికి 11 భాషలు తెలుసు. ఆఖరిరోజులలో వారు యిచ్చిన రిపోర్టు బయటకు వచ్చినదో లేదో తెలి

యదు. సమస్త భాషాభివృద్ధికి కార్యక్రమాలు చేయవచ్చుననేది నిర్ణయించమని రామకృష్ణరావుగారి అధ్యక్షతన ఒక కమిటీని వేశారు. విశాలాంధ్ర ఏర్పడిన మరుచటి రోజున ఆంధ్ర పత్రికా ఆఫీసులో ఒక మీటింగు జరుగుతున్నప్పుడు "ఏమండీ రామకృష్ణరావుగారూ మీరు వున్నారని మేము ఇక్కడకు వస్తూంటే మమ్ములను విడిచి పెట్టి మీరు పోతున్నారేమిట" అన్నాను "నన్ను పొమ్మనమని అంటే పోతున్నాను'' అన్నారు. "మీరు పోవాలనికాదు. మీరు వుండాలనే వచ్చాము" అని నేను చెప్పాను. ఆంధ్ర ప్రదేశ్‌ను వదిలిపెట్టడానికి ఆయనకు ఇష్టము లేదు కాని గవర్నరు పదవి వచ్చేటప్పటికి ముందుకు వెళ్లడము జరిగింది. ఒక స్థాయిలో పైకి వచ్చి నిర్ణయాలు చేసిన మనుష్యులు చివరివరకు అదే స్థాయిలో వుంటారని అనుకోలేము. అదికూడ పొరపాటు. ఆయనగారికి దిగులు లేదు. కాని మనము ఒకటి ఆలోచించవలసి వుంది. ఆయన హైదరాబాదు రాష్ట్ర ముఖ్య మంత్రిగా చేసిన సంస్కరణలు ఈ నాటికి మనము చేయలేకపోయాము. వాటిని నిలుపుకొంటే మన కార్యమే. ఆయన తీసుకుని వచ్చిన land reforms లెజిస్లేచరులో తీసుకుని వచ్చిన పద్ధతులు చాల liberal. అప్పుడు వైద్యగారు వుండే వారు. ఏది అడిగితే అది వెంటనే accept చేస్తూవుండేవారు. ఫ్యూడల్ విధానము నుంచి పార్లమెంటరీ విధానమునకు వచ్చు సంధియుగములో చాల liberal గా వుండవలసివుంటుది. అది వారిలో వుండ బట్టే హైదరాబాదు రాష్ట్రము పురోగమించి పార్లమెంటరీ విధానముతో fit in అవడానికి అవకాశమువచ్చింది. వారు అనేక పుస్తకాలు వ్రాశారు. పార్సినుండి అనువాదాలు చేశారు. వారు భాషకు చేసిన సేవ మర్చిపోలేము. అది మర్చిపోతే ఆయనను మర్చిపోయినట్లే. తెలంగాణా జీవితానికి, ఆంధ్ర జీవితానికి ఒక తేడా వుంది. తెలంగాణా జీవితం సంస్థ జీవితం. ఆంధ్ర జీవితం వ్యక్తి జీవితం. తెలంగాణాలో ఇన్‌స్టిట్యూషనల్ లైఫ్‌ను బిల్డప్ చేయడానికి దానికి కావలసిన స్థలాలు, విరాళాలు వారుఇచ్చారు. హైదరాబాదులో కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, సారస్వత పరిషత్ భవనాలు ఆయనచేసిన శాశ్వత పనులు. అయితే వారు తెలుగు భాషకు చేసినది ఇవాళ మనం పూర్తి చేయవలసివుంది. వారికోర తెలుగు భాషను శాశ్వతంగానూ సుస్థిరంగానూ వుంచడానికి ప్రయత్నం చేయాలి. వారు లేని లోటును ఒక్కరు తీర్చలేక పోయినా మనం అందరం కలసి భాషా సమస్యపై కాని, రాజకీయ నిర్వహణలో కాని వారు లేని లోటును తీరుస్తామని ఈ సమయంలో ప్రతిజ్ఞ తీసుకోవాలని మనవిచేస్తూ వారికి నా జోహారులర్పిస్తూ ఈ సంతాపతీర్మానాన్ని బలపరుస్తూ ముగిస్తున్నాను.

శ్రీ సి. వి. కె. రావు (కాకినాడ) :—అధ్యక్షా, ఈ రోజు మనం ఈ సమావేశం అయ్యేముందు ఈ పట్టణంలో ప్రజలకు ప్రతినిధ్యం వహించి బాధ్యతాయుత స్థానం అలంకరించిన బూర్గుల రామకృష్ణరావుగారు మరణానికి గురి అవుతారని ఊహించలేదు. సభానాయకులు బ్రహ్మానందరెడ్డిగారు ఆయన మరణంపట్ల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను, నామిత్రుల తరఫున బలపరుస్తున్నాను. మరణం మరణించిన వారికంటే జీవించియున్నవారికి బాధగా వుంటుంది. ప్రజాప్రతినిధులమైన మనం, ప్రజా సేవ చేయదలచుకొన్న మనం అటువంటివారు ప్రజలకు చేసిన సేవనుండి మంచి గుణపాఠాలు నేర్చుకోవలసివుంది. రామకృష్ణరావుగారు వారి యుగంలో అమోఘమైన సేవ చేశారు. ఆ కాలంలో అష్టకష్టాలకు లోనై వుంటారు. ఆ అష్టకష్టాలు ఎదుర్కోవటంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు మనకు ఆనవాయితీగా వుండాలి. సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీమతి జె. ఈశ్వరీబాయ్ (ఎల్లారెడ్డి) :— అధ్యక్షా, నిజంగా నాకే కాదు మొత్తం తెలంగాణా ప్రజలకే రామకృష్ణరావుగారి మరణం పెద్ద షాక్ మాదిరిది. తెలంగాణాలో గ్రామగ్రామంలోను రామకృష్ణగారంటే చిన్నవాడి మొదలు పెద్దవారి వరకు అందరికి ఎంతో ప్రేమ, భక్తి భావం వుండేది. ఆయన వకీలుగా వుండి తరువాత వెల్లోడి గవర్నమెంటులో ఆయన 4 గురు మంత్రులను ఎన్నుకొన్నారు. వారు రామకృష్ణరావుగారు, చెన్నారెడ్డిగారు, వి. బి. రాజుగారు, రంగారెడ్డిగారు ఈ నలుగురు మంత్రులు వున్నారు. తరువాత 1952 లో ఎన్నికలు జరిగినప్పుడు ఆయన మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ నుండి ఎన్నిక అయి ఈ శాసన సభకు మొట్టమొదటి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మినిష్టర్ షిప్‌లో ఏ చిన్న పనినైనా ఈ కష్టం వుందంటే ఆయన స్వయంగా చూసి ఆ కష్టాన్ని తీర్చేవారు. ఆయనకు 8 భాషలు వచ్చును. హైదరాబాదు శాసన సభలో మహారాష్ట్ర జిల్లాలు, కర్నాటక జిల్లాల ప్రతినిధులువుండే వారు. మహారాష్ట్రులు అడిగిన ప్రశ్నలకు మహారాష్ట్రలో, కర్నాటకులు అడిగిన ప్రశ్నలకు కన్నడంలో, పర్షియాలో అడిగితే పర్షియా భాషలో సమాధానాలు ఇచ్చేవారు. అన్ని భాషలలో ఆయన ఆరితేరినవారు. విశాలాంధ్ర కావాలనే నినాదం వారు చేశారు. దానిలో వారు ఎన్నో బాధలు పడ్డారు. ఆయన ముఖ్యమంత్రిగా వున్నప్పుడు తెలంగాణా మహమ్మదీయులు ఆయన కారును కాల్చేశారు. వాటి నన్నిటిని ఆయన ధైర్యంగా ఎదుర్కొని విశాలాంధ్ర కావాలని గట్టిగా చెప్పినారు. ఆయన చేతిలో ప్రొహిబిషన్ శాఖ వుండేది. సికింద్రాబాదులోని చిలకలగూడా ఒక వార్డులో పోలీసు స్టేషన్‌కు ఎదురుగా కల్లు సారాయి దుకాణం వుండేది.

ఆ దుకాణానికి ఎదురుగా గాంధి స్టాట్యూ వుండేది. మిసెస్ వెల్లోడి ప్రెసిడెంట్ మేమంతరం ward members గా వుండేవారం. గాంధిగారి విగ్రహం ఎదుట కల్లు సారాయి దుకాణం ఏమిటి దానిని తీసివేయవలసిందని కోరితే ఆయన పర్సనల్‌గా వచ్చి చూసి ఆ దుకాణాన్ని అక్కడ్నుంచి తీసివేయించారు దానివల్ల ప్రభుత్వానికి 14 లక్షల రుపాయలు నష్టం వచ్చింది. అయినప్పటికి వీరు దానిని తీసివేయించారు. ఎటువంటి చిన్న విషయానైనా ముఖ్యమంత్రిననే భావం లేకుండా ఆర్డినరి మనిషిగా, సోషల్ వర్కర్ గా పార్టి బేధాలు లేకుండా పని చేసేవారు. ప్రపంచంలో ప్రతి మనిషి పుడతాడు, గిడతాడు. కాని అటువంటి వారు కొద్దిమందే పుడతారు. రామకృష్ణరావు చనిపోవటం మనందరకు దుఃఖకరమైంది. ఆయన మరణానికి సానుభూతి తెలియచేస్తు ఈ నాటికి ఈ House ను adjourn చేస్తే బాగుంటుందని మనవి చేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి కుటుంబానికి నా సానుభూతి తెలియచేస్తున్నాను.

Sri V. K. Naik (Gagan mahal) :-- Mr, Speaker, Sir, I fully associate myself with the Condolence Resolution moved by the Chief Minister. Two weeks back when we had met at Mr. Ramakrishna Rao's house in connection with a committee for collection of funds for a good cause, I never felt that such a bad news would come upon us so quickly within a short period of two weeks: Mr. Ramakrishna Rao's association with Hyderabad could be remembered, not in one field, but in various fields. If at all we have to summarise, I could summarise in one remark "We owe our political, social and educational existence or in any other field to him and him alone." He was a good fighter–a fighter against the feudalistic tendencies–a fighter who was in the rank and file of various good persons, a fighter who fought against the Nizam and the Nizam's feudalistic dynasty and such a good man we have lost today! He is really a great soldier. Many persons know him very well. At least in those days when communalism was rampant in Hyderabad, when on every side there was a rule of the State, and not a rule of the people, we know what a great task it was for all those great persons like Mr. Kasinath Rao Vaidya, Mr B. Ramakrishna Rao and others who had to fight to an inch to see that people's democracy prevailed in the State, as it prevailed in other parts of Bharat. So, a great soul, a patriot, a talented person who has done much for the country, we have lost today and he has left a good heritage for us and it is for us now to keep up its torch burning for all time to come by remembering him and his good deeds.

I associate myself fully with the sentiments expressed by the Chief Minister and pray that peace be bestowed on his soul and courage be given to his relatives.

శ్రీ జి లచ్చన్న (సోంపేట):—అధ్యక్షా! మాపార్టీ తరఫున మాపెద్దలు మాట్లాడిన తరువాత మాట్లాడవలసిన సందర్భం లేదు-వారితో ఏర్పడినటువంటి సన్నిహిత పరిచయంవల్లనైతేనేమి, సహచర్యంవల్ల నైతేనేమి రెండుమాటలు చెప్పడం ధర్మం అనుకుంటూ మీ అనుమతి కోరాను. అవకాశం యిచ్చినందుకు కృతజ్ఞుడను భారతదేశంలో ఒక ప్రముఖ రాష్ట్రంలో, ప్రపంచ చరిత్రలో కూడా ఆంధ్రప్రదేశ్ అనేరాష్ట్రము వుంది. ప్రపంచంఅంతా గుర్తించే పరిస్థితులు యీనాడు కలిగింది. ఆంధ్రప్రజలలో గర్వకారణానికి ప్రధానకారకులు శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి యుండదు. ఎందుకంటే, ఆంధ్రదేశములో వున్నప్రజలందరు విశాలాంధ్ర నిర్మాణానికి ముక్తకంఠంతో పని చేశారు. కాని తెలంగాణాతో విశాలాంధ్రనిర్మాణానికి ఏర్పడిన తీవ్ర వ్యతిరేక ఉద్యమము సామాన్యమైనదికాదు. అలాంటి ఉద్యమాన్ని అతి చాతుర్యంతో, చాక చక్యంతో, తెలంగాణా ప్రత్యేకంగా వుండాలని ఆనాడు తెలంగాణా ప్రజలు తీవ్రమైన విద్రోహపూరితమైన ఉద్రేక పూరితమైన ఉద్యమాలు సాగిస్తున్నప్పుడు ఆయన చూపిన చాకచక్యం, చతురత, ఆయన ప్రభుత్వ అధినేతగా వుండి ఆనాటి హైదరాబాదు ప్రభుత్వానికి నాయకుడిగా వుండి, తన మంత్రి వర్గంలో వచ్చినటువంటి అధిక సంఖ్యాకుల తీవ్రప్రతిఘటనను అతి చాకచక్యముతో ఎదిరించి చిరునవ్వుతో కేంద్రప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ నిర్మాణము చేస్తేనే ఎలాంటి ప్రమాదం వుండదని నచ్చ చెప్పగలిగినటువంటి ఆయన యీ కృషి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి అంగీకరించిందని విశ్వసించిన వారిలో నేను ఒకరిని అని మనవి చేస్తున్నాను అనేక పెద్దలు చెప్పినారు. వారితోపాటు మొదట నాగార్జునసాగర్ ప్రాజెక్టు బోర్డులో, వారు హైదరాబాదు ప్రభుత్వ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆనాటి ఆంధ్రగవర్నమెంటు ప్రతినిధులలో నేను ఒకడినిగా వున్నప్పుడు పరిచయం ఏర్పడింది. తరువాత ఆంధ్రప్రదేశ్ నిర్మాణ సందర్భంలో Integration Committees లో వారితోపాటు ఉండి పనిచేసే సహాసం కలిగింది. అప్పట్లో వారు చూపిన చతురత చాకచక్యం ఎంతో తీవ్రమైన ఉద్యమాన్ని ఎదుర్కొంటూ మనిషి చలించకుండా చూపుకు చిన్న వాడిగా కనబడినా ఆయన హృదయం గంభీరమైనది ఆత్మ విశ్వాసంతో ఎలాంటి సడలింపు లేకుండా చిరునవ్వుతో ఏనాడు ఉద్రేకమైన మాట రానీయకుండా ఒకరిని తిరస్కరించాలని, దూషించాలనిగాని లేక తన శత్రువు

ఎంతటి చర్యకు పూనుకున్నప్పటికి అతిచాతుర్యంతో అతనిని మార్చగలిగినటు వంటి చతురత. ధీశక్తికలిగిన ప్రతిభావంతులలో ఒకరు, వారి దగ్గఅ నేర్చుకో వలసిన పాఠాలు చాలావున్నాయి. వారు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా వున్నప్పుడు యాత్రా సందర్భంలో లక్నోలో కలుసుకున్నప్పుడు చాలా అప్యాయత కన బరిచారు. కాని ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలు, వాటి పట్ల ఆసక్తి, విభేదాలు ఎవరి ఎవరికి ఏవిధంగా వున్నాయి అనే ప్రసక్తి ఏ సందర్భంలో కూడా చేయటం నాకు అగుపించలేదు ఆంధ్రప్రదేశ్ యొక్క క్షేమాన్ని, అభివృద్ధిని కోరారు. అభి వృద్ధి క్షేమం ఏవిధంగా వుంది, పనులు ఎట్లా జరుగుతున్నాయి, నాగార్జునసాగర్ ప్రాజక్టు బాగావుందా, ఇలాంటివాటి మీదే ఆయనప్రత్యేక ఆసక్తి చూసిన ఉదార స్వభావుడు. గొప్పవాడు. మొన్న ముఖ్యమంత్రిగారు శ్రీ గోపాలరెడ్డిగారి గౌవవార్థము విందుచేసిన సందర్భంలో ఆఖరుసారిగా కలుసుకున్నాను. చాలా ఉత్సాహముతో మాట్లాడారు, నేను. గోపాలరెడ్డిగారు, వారు కూర్చుని మాట్లాడినప్పుడు, నాఆరోగ్యం బాగానేవుంది, నేనుమంచిగానే వున్నానని చెప్పారు. ఆ చెప్పిన మూడవ రోజుననే వారికి Heart-attack వచ్చింది. అలాంటివ్యక్తి సరే పోవడం అనేది ఎవరికైనా తప్పదు-ఇంత స్వల్పకాలంలో అస్తమించుతారని ఎవరు అనుకోలేదు— వారి ఆత్మకు శాంతి కలుగాలని, సభానాయకులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, ఇలాంటి వ్యక్తుల ఆదర్శాలను సంస్మరించుకోవ డానికి వారిని దృష్టిలో పెట్టుకొని పనిచేయడానికి వీరు మార్గదర్శకులుగా వుంటా రని చెబుతూ సెలవుతీసుకుంటాను.

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి (శ్రీ ఎ. రామస్వామి) :— అధ్యక్షా! ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, ఈనాడుమనమందరము ఇటు తెలంగాణా వారము, అటు ఆంధ్రులు, ఏకస్థానములోకి రావడానికి కృషి చేసినవారిలో కీర్తిశేషులు రామకృష్ణారావుగారు ముఖ్య కారకులు- మా హైదరాబాదులో ప్రప్రథమంగా రాజకీయం అనేది ఎరుగని కాలములో-ఏదైనా సామాన్యమైన మీటింగు పెట్టుకోవాలన్నా, వ్రాతమూలకంగా ముందే ఏమి మాట్లాడబోయేది ప్రభుత్వానికి తెలిపితే, అది వారు ఇష్టపడితే, amend చేసి యిస్తే ఆ ప్రకారం మాట్లాడాలి- రాజకీయ చైతన్యం, హైదరాబాదు తెలుగు వారిలో లేనేలేదు- అట్టి సమయంలో కీ. శే. వామననాయక్, పండిత్ కేశవ రావుగారలు, పూర్వము స్పీకరుగా వున్నటువంటి కాశీనాద్ వైద్య, బి. రామ కృష్ణారావుగారు. మాడపాటి హనుమంతరావుగారు, ప్రతాపరెడ్డిగారలు మొదలైనటువంటివారలు ఒకచోటకలసి ఏ విధంగా యీ హైదరాబాదును మనము awakening చేయగలమా అని ఆలోచిస్తూ, యీ మహమ్మదీయ

ప్రభుత్వము మనలను లేవనియ్యదని ప్రప్రథమంగా మనము Library movement పెట్టుకోవాలని, ఆ రూపములో మనము ప్రవేశించాలని లేకపోతే మనకు ఎవా హైదరాబాదులో స్థానము లేదని, అప్పటి హైదరాబాదు రాష్ట్రములోని జిల్లా లన్నింటిలో మేమందరము కలసి- అప్పుడు నేను Railway Ticket Collector గా వుంటిని, నన్ను వెంటబెట్టుకొని తిరిగారు- తిరిగాము- చెప్పడం విద్యా విషయ మని కాని రహస్యంగా, నాయనా, మేల్కొనకపోతే మనకు బ్రతుకులు లేవు, మనకు రక్షణ లేదని వారందరికి ప్రబోధం చేయడం. ఈ విధంగా అన్ని జిల్లాలలో నన్ను వెంటబెట్టుకుని తిరిగారు- యీ మహానుభావులు. అప్పుడువారిలో awakening వచ్చిన తరువాత Library movement అని స్థాపనచేసిన చోటల్లా రహస్య ఉద్యమం లేపడానికి ఆంధ్రమహాసభ ఏర్పాటుచేశాము- అటు Maharashtra Sabha అనేది ఒకటి ఏర్పాటుచేశారు- కర్నాటకసభ ఏర్పాటు చేశారు- అప్పుడు ముగ్గురు యీ దేశములో వున్నారు. ఈ మూడు కలసి ఉద్యమం పెరుగుతూ వచ్చింది- తరువాత కాంగ్రెస్ ఏర్పాటుచేయబడింది యీ హైదరాబాదులో — ఎంతో awakening వచ్చిన తర్వాత,— ఈయన వకీలుగా పనిచేస్తూ ఉండేవారు. ఆయన High Court Judge గా ఉండగా, రహస్యంగా పనిచేస్తూ ప్రముఖపాత్ర వహించారు. అప్పుడు నేను రైల్వేలో పనిచేస్తూ ఉండేవాడిని ఈవిధంగా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయం వచ్చినప్పుడు, ఆంధ్రులకు, మాకు సంబంధ బాంధవ్యములు ఉన్నా దానికి dead enemy గా పనిచేసిన వాళ్ళలో నేను ఒకడిని. మాకు ఆంధ్రప్రదేశ్ వద్దు మాకు తెలంగాణా యే ఉండితీరాలి. ఆఖరుకి ఆనాడు Raja representative తో అసెంబ్లీలో కూడా అన్నారు. ఎందుకు నీవు ఇంత enemy గా మాట్లాడుతున్నావు. ఆంధ్రుల గురించి అని అడిగారు. దానికి నేను enemy ని గాను. నేను దానికి పుట్టిన బిడ్డనే. తెలుగు, ఆంధ్ర భాష అనే భేదంగాని, ఆఖరికి ఒక ఇంటి బిడ్డలమే. కాని అన్న ఒకచోట, తమ్ముడు ఒకచోట పనిచేస్తున్నామంటే, ఇక్కడ మేము అభివృద్ధి చెందుతాం. అక్కడ వాళ్లు అభివృద్ధి చెందుతారు. Centre నుంచి రెండు విధాలుగా హక్కులను సంపాదించుకోవచ్చు. తర్వాత ఇద్దరం ఒక్కటి అవుతాం అనిచెప్పినాను. అంతవరకు మా తెలంగాణా separate గా ఉండాలి. ఆఖరికి ఒక 5 సం॥ లు అయినా separate గా ఉండాలి ఆంధ్రులలో కలసి ఉండకూడదు. వారి status ని చూస్తే, మేము చాలా క్రింద ఉన్నాం. మనం equal కాజాలం, అదీ గాక, మహమ్మదీయుల గవర్నమెంటుపోయి, బ్రిటిష్ గవర్నమెంటుపోయి, ఆంధ్రప్రభుత్వం అనేdomination వచ్చిపడుతుంది. మాకు ఇప్పుడు వద్దు. మేము సమానం అయినప్పుడు కలుస్తాం. ఆఖరుని ఎట్లాగు కలవక తప్పదు అనే

speeches ఇచ్చినవాళ్ళలో ఒక్కడిని. అప్పుడు ప్రోత్సాహం చేసినవాళ్ళలో ఈ పెద్దలంతా ఉండిరి. అటు తర్వాత ఆంధ్రా కాక తప్పదనే నిర్ణయం వచ్చి నప్పుడు, నేను చెప్పాను. British Govt. లో Training అయిన ఆంధ్రులకు- మహమ్మదీయ ప్రభుత్వంలోపుట్టి, వాళ్ళ కాళ్ల క్రింద త్రొక్కబడినటువంటి తెలంగాణావాళ్లు ఎట్లా కలుస్తారు. వాళ్లు వచ్చి dominate చేస్తారు. ఉద్యోగాలు అన్నింటిలో తెలంగాణావాళ్లని లేవనీయరుసుమా అని అన్నాను కాబట్టి వాళ్ళ రక్షణార్థం కనీసం 5, 10 సంవత్సరాలు అయినా దూరంగా ఉండాలి.

ఇద్దరూ equal గా వచ్చిన తర్వాత కలుస్తాం అన్నాం. తెలంగాణాకు ద్రోహం చేస్తున్నారు రామకృష్ణారావుగారు అని ముఖంమీద తిట్టినాను. ఆ మహానీయుడు ఎంతో ఓర్చుకొన్నాడు. ఎట్లా అయితేనేం, మనం అందరం ఒక్కటి అయాం. స్వామీజీని, రామకృష్ణారావుని ముఖంమీద దూషించాను. మీరు ఇద్దరూ కలసి తెలంగాణాన్ని ధ్వంసం చేస్తున్నారన్నాను. కర్నాటక వాళ్లని తిట్టినాను. మీ దేశానికి మీరు పోక మమ్ములను కలవమని చెప్పడానికి మీరెవ్వరని అడిగాను మహారాష్ట్రులను దూషించాను, మీరు పోయేటటువంటివాళ్లు పోక, మమ్ములను కలవమంటారే. మేము అన్నదమ్ములం ఎప్పటికయినా కలుస్తాం. దూరంగాలేము. ఇద్దరం ఒకటే. కాని స్వామీజీని, రామకృష్ణారావుని చాలా నిందించాను. అప్పుడు ఆయన అన్నాడు రామస్వామి — మీకు ఏమిభయంలేదు. Regional Committee పెడుదాం అన్నారు, హృదయం మారకపోతే Regional Committee పనిచేస్తుంది. Officials అందరూ తెలంగాణావాళ్లని త్రొక్కకుండా మీరు ఏమి చేయగలరు? వాళ్లు విద్యావంతులు వీళ్లు విద్యా విహీనులు condolence motion పెట్టి ఆయన ఆత్మకు శాంతికలగాలంటే నోటి మాటలతో శాంతి కలుగజాలదు. ఆయన అప్పుడప్పుడూ అనేవారు, రామస్వామి, తెలంగాణా కొరత ఆఖరుకి ఉండిపోయిందని అనుకొనేవారు లోలోపల. జరుగుతున్నాయి నెలలు అన్నారు కూడా, నిజంగా వారి ఆత్మకు శాంతి కలగాలంటే, మీ అందరి చరణాలకు నమస్కారం చేసి కోరుతున్నాను. మాలో ఆంధ్రా, తెలంగాణా అనే Disparities లేకుండా చేయగలిగిననాడే వారి ఆత్మకు శాంతి కలుగుతుందని మీ అందరిని ప్రార్థిస్తు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను.

డాక్టర్ టి. వి. ఎస్. చలపతిరావు (విజయవాడ-ఈస్ట్):—అధ్యక్షా! ఉత్తమ శ్రేణికి చెందిన నాయకులు అయిన శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారి జీవిత యాత్ర ఈరోజుతో ముగిస్తుందని, పంచ భూతాత్మకమైన శరీరాన్ని వదలి వారు పరమేశ్వరునిలో లీనం అయ్యారనే వార్త, ఈ సభకు, ఇంత

హఠాత్తుగా ఈ విషాదవార్త వస్తుందని అనుకోలేదు. డాక్టరుగారు నాకు బాగా తెలుసు, వారికి చేసిన జబ్బునిబట్టి వారు జీవించటం కష్టం అని తెలిసినా — నెమ్మదిగా ఉన్నదిగదా అని, ఏ రోజుకారోజు వెళదాం అనుకొంటూనే, ఖాళీ లేకపోలేదు. ఈ రోజు విశ్రాంతి గదా వెళదాం అనుకొంటే, వారి దర్శనం లేకుండానే మరణించటంవల్ల. అందరికంటే ఎక్కువ విచారపడవలసిన దుస్థితి కలిగింది. అందుకు నేను చాలా బాధపడుతున్నాను. కాని దైవ నిర్ణయానికి ఎవ్వరూ బాధ్యులు కారు. పెద్దలంతరూ వారిగుణగణాలను, జీవిత విశేషాలను గురించి ప్రస్తావించారు. అదే నేను చెప్పటం చర్విత చరణం అవుతుంది. ఈ విశాలాంధ్ర ఏర్పాటుకు. యావత భారత దేశంలోను, ఉత్తమ స్థాయికి చెందిన రాష్ట్రంగా ఈ రాష్ట్రం వర్ధిల్లుతున్నదంటే, దీనికి శంకుస్థాపన చేసినవారు రామకృష్ణరావు గారు. వారే గనుక రామస్వామిగారి వాదనకు అంగీకరించి ఉండినట్లయితే, విశాలాంధ్రగాని, మనం ఈ సభలో గాని ఉండటం తటస్థించేది కాదని వేరుగా చెప్పదలచిన పనిలేదు. వారు బహు భాషాకోవిధులు. అందువల్లనే వారు ఇంత Statesmanship గా వ్యవహరించే అవకాశం కలిగింది. ఆ రోజులలో పెద్దలు చెప్పేవారు. కీర్తిశేషులు మౌలానా ఆజాద్ గారికి ఈయన ఆకర్షించారంటే, వారికి పర్షియన్ భాషలో ఉన్న పాండిత్యం అని చెప్పారు. వల్లభాయిపటేలు గారికి ఆకర్షించారంటే, వారిలో ఉన్న ప్రతిభా కారణం అని చెప్పవచ్చు. నెహ్రూగారి దగ్గర నుండి, అగ్రశ్రేణి నాయకులందరిని ఆకర్షించారంటే, ఎంతో కష్టదశలో ఈ తెలంగాణాను-ఒక ఆదర్శమైనటువంటి అభ్యుదయ మార్గాన నడిపి, ఆంధ్రకు, తెలంగాణాకు వారధివేసి విశాలాంధ్ర స్థాపకులలో ప్రథములు. కేవలం తెలంగాణా చరిత్ర వ్రాసినప్పుడే కాదు, ఆంధ్రప్రదేశ చరిత్ర వ్రాసినప్పుడే కాదు. కేరళ గవర్నరుగా ఎంతక్లిష్టదశలో వెళ్లారో మనకందరికి తెలుసు ఎంతో Statesmanship ప్రదర్శించి అంతకష్టకాలంలో అందరి మన్ననలు పొంది. గవర్నరు పదవి నిర్వహించారు. కేరళ చరిత్ర వ్రాసినప్పుడు కూడా వారి పాత్ర ప్రముఖ స్థానం వహిస్తుందని, సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని వేరుగా చెప్పవలసినపని లేదు. ఇక U. P. లో ఏ పరిస్థితులలో వెళ్లారో అందరికి తెలుసు. అలాంటి వారు మనముందు లేకపోవటం చాలా దురదృష్టకరం. 75 సం॥ల ఉత్తమ జీవితం గడిపి, ప్రజారంజకంగా ప్రజాసేవచేసి పేరుపొంది అన్ని వర్గాలవారి ప్రేమను చూరగొన్నారు. మాధవరావుగారు చెప్పినట్లుగా, వారికి ఆధ్యాత్మిక చింతన చాలాజాస్తి. ఒకసారి వారిదర్శనానికి పోతే 3½ గంటలసేపు జపంచేస్తారని, 12 గంటల దాకా, దర్శనం లభించదని చెప్పారు. అటువంటి ఆయనను 'పూర్ణపురుషుడు' అని వేరుగా చెప్పవలసినపని లేదు.

వారు ఈ రజాకార్ ఉద్యోమంలో విజయవాడ పట్టణంలో డా. చెన్నారెడ్డిగారు, వారు, మకాము పెట్టుకోవడం, ఆ సందర్భంలో వారికి నాకు పరిచయము కలిగేటటువంటి భాగ్యమే కాకుండా తెలంగాణా నాయకులను గౌరవించి ఆంధ్రయందు ఉంచేటటువంటి అనుమానాలు తీరాలనేవారు. ఏ పదవినీ అలంకరించని రోజులలో, నేను విజయవాడ పురపాలక సంఘ అధ్యక్షులుగా ఉండడం సందర్భంగా మేము వారికి పౌర సన్మానం చేశాము. అప్పుడువారు ఏ మంత్రి కూడా కాడు. మామూలు బూర్గుల రామకృష్ణ రావు గారు నాయకులు, advocate వారు. అధికారంలోకి రాగానే వెంటనే ఈ లింకులు ఏర్పాటు చేయాలని, అప్పుడు Road Transport Corporation ప్రభుత్వము చేతిలోనే ఉన్నది, వెంటనే హైదరాబాద్ నుంచి విజయవాడకు ఒక bus service ఏర్పాటు చేశారు. ఇట్లా అనేక వారదులు రహదార్లు ఏర్పాటుచేసి చివరకు విశాలాంధ్ర ఏర్పాటుచేసిన ధన్యజీవి. వారిని గురించి పెద్దలు చెప్పినదానితో నేను ఏకీభవిస్తూ నా యొక్క సానుభూతిని వారి కుటుంబానికి తెలియపరుస్తూ ఈ అవకాశం ఇచ్చినందుకు తమకు ధాన్యవాదాలు అర్పిస్తున్నాను.

श्री रामचन्दर राव कल्यानी ( ) सभापतिजी। श्री मुख्य मंत्रीजी के प्रस्तावित संताप प्रस्ताव का अनुमोदन करते हुअे दो चार शब्द आपके सामन रखना चाहता हूं। श्री बी. रामकृष्ण राव के देहान्त से न केवल हमारे जिले को बल्कि पूरे आंध्र प्रदेश और भारतवर्ष को दुःख पहुंचा है अैसा कहन में मुझे संकोच नहीं है। क्योंकि आंध्र और भारत की उन्होंन जो सेवा की है उसे कोअी व्यक्ति भुला नहीं सकता। खासकर महबूब नगर जिले में उनके नत्रत्व में जो काम हुआ है उसको भुलाना असंभव स्है। आपको मालूम है कि निजाम सरकार के जमान में कांग्रस के नाम से कोअी संस्था काम नहीं कर सकती थी। अैसे में उन्होंन आंध्र महासभा के नाम से एक संस्था कायम की और तेलंगाना के एक एक गांव में जाकर इसका प्रचार किया। दूसरी बात यह कि महबूबनगर जिले में कई राजा महाराजाओं के संस्थान थे। वनपरती, कोल्लापूर, आत्माकूर और गदवाल उस समय की हुकूमत इन संस्थाओं को हडप करके अपने अधीन करलेना चाहती थी। लेकिन श्री बी. रामकृष्णराव उनके लीडर एडवाइजर थे उन्होंन इन संस्थानों को बचाकर रखने की कोशिश की और इनको बचाकर रखा। उनके कारण कई नवयुवकों को देश के लिये काम करने का मौका मिला और उन्होंनें कई युवकों को रास्ता दिखाया कनविंस करने की बडी योग्यता थी। आपको यह सुनकर आश्चर्य होगा उन्होंन केवल ५ व्यक्तियों की मेजारती से काम चलाया। इन ५ में से भी एक आदमी दवाखाने में रहता था। एक का देहांत हो गया था। केवल तीन की मेजारिटी से वे कारोबार चलाते रहे। उन्होंने जो टेनंसी एक्ट बनाया उसके विरूद्ध नवाबों जागीरदारों और देशमुखों ने काफी एजीटेशन किया। लेकिन उन्होंने सबको कनविंस किया, शांत किया और किसी प्रकार का एजीटेशन नहीं होने दिया। उन्होंने जो टेनंसी एक्ट बनाया आज भी ग्रामों में गरीब

लोग इस एक्ट को उन ही के नाम से याद करते हैं। मै अधिक समय नही लूंगा। उनके मृत आत्मा को ईश्वर शांति दे यही प्रार्थना करता हूं और अपनी श्रद्धान्जली अर्पित करता हुअे अपने विचारों को समाप्त करता हूं।।

శ్రీ పి. గున్నయ్య (పాతపట్టణం):—కీర్తిశేషులు రామకృష్ణరావు గారి మరణ వార్త తెల్లవారి లేచిన వెంటనే తెలిసినందుకు ఎంతో బాధ కలిగింది. నాకేకాదు, యావత్తు ప్రపంచానికి బాధ కలుగుతున్నదని నేను విచారిస్తున్నాను. కర్నూలులో ప్రకాశం గారి మంత్రి వర్గం ఉన్నప్పుడు ఈ రాజధానిలో బూర్గుల రామకృష్ణరావు గారు ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఈ శాసనసభ ఇదే సమయంలో జరుగుతున్నప్పుడు మేము చాలా మంది శాసన సభ్యులు వచ్చాము. కర్నూలు నుండి శాసన సభ్యులు వచ్చామనేసరికి వారి పార్టీతరఫున కానివ్వండి, లేక ప్రభుత్వము తరఫున కానివ్వండి, మాకు ఒక van, ఒక జీపు అవన్నీ ఇచ్చి ఎంతో సత్కరించారు. తరువాత కర్నూలులో మనము కొత్తగా వెళ్లాము. కర్రకుర్చీలలో శాసన సభ్యులు గాని, మంత్రులు గాని కూర్చొనే వాళ్లము. మేము శాసన సభ్యులుగా వచ్చి ఈ ప్రక్కన ఉన్న gallery లోనె కూర్చొన్నాము. ఆ సమయంలో ప్రశ్నల సమయంలో మరి కీర్తిశేషులైన బూర్గుల రామకృష్ణరావు గారిని చూస్తే, నిజంగా రామకిృష్ణ అనే నామధేయము వారికి ఇందుకే కలిగింది కావాల అని సంతోషించి నేను ఎంతో సంతోషించి ఆనంద భరితుడను అయ్యాను. అప్పట్లో మనకు విశాలాంధ్ర వస్తుందనే ఆశ పూజ్యులు ప్రకాశం పంతులుగారు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు మొదలైనటువంటి మహానాయకుల వల్ల వినె వారము. విశాలాంధ్ర వస్తే మనకు కూడా ఈ శాసన సభ లభిస్తుంది. మనము కూడా ఇందులో వుంటాము అనే ఆశ నాకు కలిగింది. ఆ సమయంలో 2 రోజులు ఈ రాజధాని నగరంలో ఉండేటప్పుడు, మరి కీర్తిశేషులు బి. రామకిృష్ణరావుగారి తాలూకు అనుచరులు వారిని నమ్మినటువంటి అనుచరులు, వారికంటె ఘనత గొప్ప, మంచి నమ్మకం కలిగినటువంటి వారు. అటువంటి రాముడి దగ్గర ఆంజనేయులు లాంటి భక్తులు వారి నాయకత్వం కిృంద ఉండేవారు. గాంధీభవన్ వెళ్లేటప్పుడు అయ్యా విశాలాంధ్ర వస్తుందనే ఆశతో మేముఉన్నాము. మీ అందరి అభిప్రాయం ఏమిటి అంటె, ఆయనకు పిృయమైన స్నేహితులు అందరూ కూడా మా ముఖ్యమంత్రిగారు మొదలయినటువంటి ఇక్కడ మా నాయకులుకూడా ఒప్పుకుంటారు. ఏవో కొన్ని షరతులు ఉన్నాయి. తప్పకుండా వస్తుంది అనే టటువంటి ఆశ కలిగించారు. అటువంటి ఈ విశాలాంధ్ర ముఖ్యనాయకులలో ఒకరు. మరి హైదరాబాదు రాజధాని మన India లో ఒక ఢిల్లీ తరువాత,

ఇలాంటి రాజధాని మన ఆంధ్రదేశ ప్రజలు ఆక్రమించుకొన్నారు అంటే దానికి ప్రధానమైన కారణం కీర్తిశేషులు బూర్గుల రామక్రిష్ణారావుగారు అనే చెప్పక తప్పదు. అలాంటి మహా నాయకులలో ఒకరు ఈ రోజున మన దేశంలో లేక ఆ రామచంద్రమూర్తిలో లీనమయ్యారు అంటే మన ఆంధ్రదేశానికే కాదు, యావద్భారతదేశానికి తీరనటువంటి నష్టము. అందుచేత మన పూజ్యులు సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను హృదయపూర్వకంగా బలపరుస్తూ ఈ యావదాంధ్ర దేశంలో గల హరిజన, గిరిజన ప్రజలు యావన్మంది తరఫున వారి ఆత్మకు శాంతి కలుగుగాక అని పరమేశ్వరుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ జె. చొక్కారావు (కరీంనగర్) :—అధ్యక్షా, బూర్గుల రామకృష్ణారావుగారు కన్ను మూశారు. ఒక మహాపురుషుని కోల్పోయాము. శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు, తమ యావజ్జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు. వారు న్యాయవాది వృత్తిని చేపట్టినా వారి పూర్తి సమయానికి ప్రజా సంస్థలకొరకు, విద్యాసంస్థల కొరకు వినియోగిస్తూ వచ్చారు. స్వాతంత్ర పోరాటంలో వారు ఎంతో పాత్రవహించారు. నిజాము పరిపాలనకు అంతమొందించేటటువంటి ఉద్యమంలో ఆనాడు భారత దేశంలో ఇతర రాష్ట్రాలలో, ఇతర ప్రాంతాలలో కంటె అధికమైన కఠినమైన షరతులు, ఎన్నో ఇబ్బందులు ఉన్న కాలములో ఆ స్వాతంత్ర పోరాట నిర్వహణలో మరి యువకులనందరిని కూడ సమీకరించి ఎంతో నాయకత్వాన్ని వహించారు. నాకు కూడా తెలుసు. ఎన్నో పట్టణాలకు వెళ్ళినప్పుడు వారికి ఉండడానికి స్థలము కూడా, ఇవ్వకుండగా Cars లోనే ఉంది. గ్రంథాలయ ఉద్యమమని పేరుతోనో, ఆంధ్ర మహాసభయొక్క ఉద్యమం పేరుతోనో రాజకీయంగా మన యువకులందరిని సమీకరించి ఆ పోరాటాన్ని నిర్వహించారు. స్వరాజ్యం వచ్చిన తరువాత నిజాం పరిపాలన అంతమొందిన తరువాత వారు మొట్టమొదట వెల్లోడి యొక్క ప్రభుత్వంలో రివిన్యూశాఖ మంత్రిగా తీసుకోబడి అక్కడినుంచి ప్రభుత్వంయొక్క రంగంలో ప్రజలకు హితమైనటువంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. 1951 లో మొట్టమొదటి సారిగా ప్రజాప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా ఎన్నిక అయి 5 మెజారిటీ ఉన్న పార్టీకి నాయకత్వం వహించడం వారు ఎంత మేధావులో, ఎంతటి రాజకీయ చతురత ఉన్నదో, ఎంత ప్రజ్ఞ ఉన్నదో ఆ విషయాలు జ్ఞాపకం తెచ్చుకున్నప్పుడు మనకు బాగా అర్థమవుతుంది. ఆనాడు హైదరాబాదులో ఒక వైపు కమ్యూనిస్టుల అలజడి, అరాచక పరిస్థితులు, అక్కడక్కడ మతకలహాలకు తావుఉన్నటువంటి సమయంలోకూడ వారు ఎంతో దీక్షతో, ఎంతో ప్రతిష్ఠతో

వారు ముఖ్యమంత్రి పదవిని పూర్తిగా నిర్వహించారంటే వారి మేధాశక్తి, రాజకీయ చతురత చరిత్రలో మరుపుకు రానటువంటివి. ఆ రోజులలో కౌల్దారీ శాసనం, భూసంస్కరణలు, జాగీర్ల రద్దు, ఎన్నో అభివృద్ధికరమైన శాసనములు తెచ్చి అమోఘమైన కృషిచేశారు. ఆంధ్రప్రదేశ్ యొక్క నిర్మాణములో విశాలాంధ్ర ఉద్యమములో వారి పాత్ర అమోఘమైనది. వారి మేధాశక్తి రాజకీయ చతురతతోనూ విశాలాంధ్ర సాధించామని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదని మనవిచేస్తున్నాను. తరువాత వారు కేరళలోను, యు. పి. లోను గవర్నరుపదవుల నలంకరించినారు. తరువాత రాజ్యసభలో ఉండి, వారు చేసిన సేవ మన రాష్ట్రమునకే కాదు, దేశానికే ఎంతో మేలు చేకూర్చినది. వారు రాజ్యసభ సభ్యులుగా ఉన్నకాలములో నదీజలాల సమస్య వచ్చినప్పుడు నేను మూడు నాలుగురోజులు వారివెంట ఢిల్లీలో ఉండి చూచాను. దాని పరిష్కారము కొరకు వారు దిన రాత్రములు ఎంతో కష్టపడ్డారు. పోచంపాడు ప్రాజెక్టు రావాలని చూపిన వారి పట్టుదల చూస్తే నాకే ఎంతో ఆనందం కలిగింది. రాజ్యసభలో లేకున్నా వారు ఊరికే కూర్చునే వారు కాదు. సంస్కృత భాషాభివృద్ధి, యితర ప్రజాహిత సంస్థల అభివృద్ధి ఎట్లా జరగాలి అనేదే వారు ఆలోచించేవారు. రాత్రి వారు కన్ను మూశారు. అది మాకు ఎంతో నష్టం కలిగింది. మనందరిలో ఆ దుఖము ఉన్నది. ప్రత్యేకంగా తెలంగాణా ప్రజలు దుఖ సాగరంలో మునిగినారనుటలో ఏమీ అతిశయోక్తి లేదు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారికుటుంబానికి సంతాపం తెలుపుతూ భగవంతుని వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

شری احمد حسین ـ مسٹر اسپیکر ـ آج جو قرار داد تعزیت اس هاوز میں میں پیش کیگئی هے میں اسکی تائید کرتے هوئے اتنا عرض کرونگا که میری عمر اگرچیکه کم هے مگر میں انہیں اس زمانے سے جانتا هوں جبکه وه وکیل کی حیثیت سے پرتاب گیرجی کی کوٹهی کی پیچهے والے مکان میں اپنا آفس رکهتے تهے ـ پسته قد هونے کے باوجود انکا دماغ اتنا بڑا تها که شاید هی ایسا کوئی آدمی تلنگانے کا هوسکتا هے ـ حیدرآباد سے تقریباً ۳۰ میل کے فاصله پر بورگل هے وهاں ایک دو مرتبه انکے ساتھ جانے کا مجهے اتفاق هوا هے ـ دو تین بار انکے قریب رهتے هوئے میں نے یه اندازه کیا که ان میں کام کرنے کی لگن تهی ـ جو سوچتے تهے اسکو پورا کرنے کی سعی کرتے تهے ـ مستقل مزاجی اور خود ارادی اتنی پخته تهی که جو سوچتے تهے وه کر گزرتے تهے ـ اسی لئے انهوں نے اتنی

ترقی کی ۔ باہر بھی گورنر کی حیثیت سے کیرالا وغیرہ میں انہوں نے جو کارنامہ انجام دیا ہے وہ نا قابل فراموش ہے ۔ کل تک انہیں نام سے پکارا جاتا تھا اور آج انہیں '' مرحوم '' کہتے ہوئے افسوس ہوتا ہے ۔ واقعی ایسے آدمی کا بچھڑ جانا دکھ کی بات ہے ۔

تعزیتی قرارداد جو پیش کیگئی ہے میں اپنی پارٹی کی جانب سے اسکی تائید کرتا ہوں ۔ دعا کرتا ہونکہ انکی آتما کو شانتی ملے اور انکے خاندان کے لوگوں کے غم میں ہم سب شریک ہیں ۔

శ్రీ ఎం. వెంకటనారాయణ (ఏలూరు). —అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. నిన్ననే యిక్కడ ఒక సంతాప తీర్మానం చేయడం, తిరిగి యీనాడు యిది తటస్థించడం విచారకరమైన విషయం. ఏమైనప్పటికి భగవంతుడు భగవద్గీతలో చెప్పినట్లుగా రెండురకాలు — పుట్టినవాడు గిట్టక మానడు — కాని వారిలో జీవన్మృతులు, మృతజీవులు అని రెండురకాలు చూస్తున్నాము. బ్రతికి ఉన్నా చచ్చిపోయినవారిలో సమానంగా ఉండేవారు; చనిపోయినా ఆచంద్రార్కం సజీవులుగా ఉండేవారని చరిత్రలో మనకు ఉన్నారు. అదేవిధంగా బూర్గుల రామకృష్ణరావుగారి జీవిత చరిత్ర సింహావలోకనం చేస్తే ఆచంద్ర తారార్కం భారతదేశం ఉన్నంతవరకు వారి జీవితచరిత్ర అమరమై ఉంటుంది. ఆదర్శాలు, ఆశయాలతో, దేశం కోసం, సంఘంకోసం, సమాజం కోసంచేసే త్యాగధనం వారు మనకుయిచ్చి పోయారు. అదంతా మనదేశ భవితవ్యంకోసం స్వీకరించి అనుసరించవలసినటువంటిదని వారి జీవితచరిత్ర చెబుతోంది. చిత్తూరునుంచి శ్రీకాకుళం వరకు యావదాంధ్రప్రజలను యిటు తెలంగాణా వారిని కూడా కలిపి యీ విశాలాంధ్రను ఏర్పరచినది రామకృష్ణారావుగారని చెప్పుటకు సందేహం లేదు. అటువంటివారికి సానుభూతిని అర్పిస్తూ, వారి కుటుంబానికి కూడ నా సానుభూతిని తెలుపుతూ, సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ వి. రామారావు (సికింద్రాబాద్-కంటోన్‌మెంటు) :— అధ్యక్షా, మన ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాము. కీర్తిశేషులైన బూర్గుల రామకృష్ణారావుగారు చేసిన సేవ గురించి రెండు మాటలు చెప్పాలనుకొంటున్నాను. ఆ నాడు హైదరాబాద్ గవర్నమెంట్‌లో వారు ముఖ్యమంత్రిగా ఉన్న హయాములో-ఆ ఐదు సంవత్సరాలు 11, 12 మంది

మెజారిటీతో మాత్రమే ప్రభుత్వము ఉండినది. అట్టి పరిస్థితిలో వారు ఎంత యుక్తివంతంగా పరిపాలన చేసినారో మనం చెప్పలేము. వారు ఎంతో తెలివి తేటలు ఉపయోగించినారు. వారి మరణం యీ రాష్ట్రానికే కాదు. యీ రాష్ట్రంలో ఉన్నటువంటి హరిజన జనాభాకు ప్రత్యేకంగా నష్టమని భావిస్తున్నాను. ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి హరిజన జాతిపైన వారికి ప్రత్యేకమైన దృష్టి ఉన్నది. మొదటి జనరల్ ఎలక్షన్స్ అయిన తర్వాత శాసనసభలో ఉన్నటువంటి హరిజన శాసన సభ్యులమందరము హరిజనుల యొక్క సాధకబాధకములు వారి దృష్టికి తెచ్చినపుడు వారు అన్నారు—యీ శాసన సభలో ఉన్నటువంటి హరిజన శాసన సభ్యులందరు—వారు ఏ పార్టీవారైనా అందరూ-ఒక అసోసియేషన్‌గా ఫారమ్ అయి, మీ ఆర్థిక పరిస్థితులు, మీ సోషల్ ఎకనమిక్ ప్రాబ్లమ్స్, మీ ఇండ్ల సమస్య, మీ కొలువు సమస్య—మీరంతా ఒకచోట కూర్చుని మాట్లాడుకొని బడ్జెట్ సెషన్ సమయంలో ఒక మెమోరాండం రూపంలో నాకు ఇస్తే-మొత్తం హెడ్స్ ఆఫ్ ది డిపార్టుమెంట్స్ అందరిని పిలిపించి మీ కష్టాలు వారి ఎదుట పెట్టి మీ సాధకబాధకాలు నివారణ చేయటానికి నేను ప్రయత్నం చేస్తాను—అని చెప్పారు. వారు ఆ విధంగా చెప్పటంవల్ల మేము-హరిజన ఎం. ఎల్. ఏలం అందరం ఒక అసోషియేషన్‌గా ఫారమ్ అయి వారితో ప్రారంభోత్సవం చేయించాము. నైజాం కాలంలో హరిజనుల కొరకు ఇవ్వబడిన కోటి రూ. లకు వారు ఛీఫ్ మినిస్టర్ అయిన తర్వాత, చైర్‌మన్‌గా ఉన్నారు. అప్పుడు వారు ఏమన్నా రంటే—ఆంధ్రలో హరిజన హాస్టల్స్ వందల కొలది ఉన్నవి. హైదరాబాదు స్టేటులో లేవు. ఆ కోటి రూ. ల తో హరిజన హాస్టల్స్ ఇక్కడ పెట్టుకొంటే బాగుంటుంది; మీరు ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళి అక్కడ ఉన్న హరిజన హాస్టల్స్ చూసి, ఇక్కడ కూడ అటువంటివి ప్రారంభించాలి—అని సలహా ఇచ్చారు. వారి సలహా ప్రకారం మేము కొంతమంది ఒక కమిటీగా ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళి. హాస్టల్స్ చూసి, అటువంటి హాస్టల్స్, హైదరాబాదు స్టేటులో, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాలలో స్థాపించుకోగలిగాము. వారు ఇంకోటి చెప్పినారు;—మీ జాతిలో ఒక వృత్తి ఉన్నది; అది లెదర్ ఇండస్ట్రీ, తోళ్ల చెప్పుల పరిశ్రమ; యీ కోటి రు. ల నుండి కొంత డబ్బు మీకు యీ పరిశ్రమ అభివృద్ధికి ఇస్తాను; అటువంటి పరిశ్రమలు అభివృద్ధి చేయండి—అని చెప్పి, మొట్టమొదట తన ఉళ్లో, బూర్గులలో తోళ్ల పరిశ్రమ పెట్టటానికి తోడ్పడ్డారు. ఇపుడు ఆ తోళ్ల పరిశ్రమ ఆ ఊళ్లో నడుస్తున్నది. వారి సలహా ప్రకారం యీ పరిశ్రమలో యీ రాష్ట్రంలో స్థాపించుకోగలిగాము. మేము హరిజనులమంతా ఆనాడు వారికి ప్రత్యేకమైన పేరు—వామన అవతారము—అని పెట్టాము. రామకృష్ణయ్య,

మాలమాదిగలను మరచిపోకయ్యా అని యీ విధంగా పాటలు, పద్యాలు పాడే వారము. హరిజనసమస్య, హరిజనసంస్థ, హరిజనులయొక్క రాజకీయాలు— వీటిలో వారు హరిజనులకు ఎంతో తోడై, నీడై, ముందుకు తీసుకువెళ్ళిన పెద్ద మనిషి. వారు చాలా మేధావంతులు. వారు ఇవాళ స్థూల శరీరం విడిచి సూక్ష్మ శరీరంగా పోయినందుకు వారి కుటుంబానికి నేను సానుభూతి తెలుపుతూ వారియొక్క ఆత్మకు భగవంతుడు శాంతి కలుగజేయాలని ప్రార్థిస్తున్నాను.

రెవిన్యూమంత్రి (శ్రీ పి. వి. రాజు) :— అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ తన చరిత్రలో ఒక గొప్ప మేధావిని కోల్పోయింది. శ్రీ రామకృష్ణారావుగారు ఒక్క మేధావియే కాదు; అజాతశత్రువు. 30 సంవత్సరాలనుండి వారితో, వారికి దగ్గరగా ఉండేటటువంటి అవకాశం నాకు కలిగింది. 1936 లో మొట్ట మొదట ఆంధ్ర మహాసభలో నేను ప్రవేశించినప్పటి నుండి వారితో నాకు పరిచయం ఉన్నది వారియొక్క సుగుణాలే కాకుండా, వారిలో ఉన్న చాకచక్యం, ఎటువంటి కఠినసమస్యలనైనా పరిష్కారంచేయగలిగినశక్తి, ఒక దూరదృష్టి, తన విరోధిని తనవైపుకు త్రిప్పుకోగలిగిన సహనం, మానవ స్వభావం—కొద్దోగొప్పో మా అందరిలో—తెలంగాణాలో పనిచేసినవారందరిలో అలవడినవి అంటే—వారివల్లనే అలవడినవి. గత 30 సంవత్సరాల చరిత్ర జ్ఞాపకం చేసుకొంటే—ఎటువంటి ఘట్టాలలో గూడా యీప్రాంతంప్రజలు వెళ్ళినారో, వారి నాయకత్వంక్రింద ఏమి సాధించారో అన్నది ఇవుడు చరిత్రవ్రాయటం మొదలుపెడితే కళ్ళతో చూసినవారము మాకే ఆశ్చర్యం కలుగుతుంది. మూడు మార్పులకు వారు కారణం. హైదరాబాద్ స్టేటును భారతదేశంలో విలీనం చేయటంలో, హైదరాబాద్‌ను శాంతియుతంగా ఏమీ తగాదాలు లేకుండా, మహారాష్ట్రులకుగాని, కన్నడిగులకుగాని, తెలుగువారికిగాని— వీరిమధ్య ఏమీ తగాదాలు లేకుండా ఒక మాట పొల్లు కూడ లేకుండా భాషా ప్రయుక్తంగా మూడు భాషలుగా చేయటంలో, ఇవాళ మనం అందరం ఇక్కడ కూర్చునటానికి అవకాశం కలుగజేయటానికి యీ విశాలాంధ్ర నిర్మాణం విషయంలో వారు చూపించిన దూరదృష్టి, చాకచక్యం, స్టేట్స్‌మెన్ లైక్ స్పిరిట్— అది తర తరాల వరకు మనం జ్ఞాపకం ఉంచుకోవలసినది. శాసనసభ వారు సభా నాయకుడుగా ఇపుడు బ్రహ్మానందరెడ్డిగారు కూర్చున్న స్థానంలో వారు, అటు లచ్చన్నగారు కూర్చున్న స్థానంలో అపోజిషన్ పార్టీ లీడర్ దేశపాండేగారు— వీరిద్దరి ఉపన్యాసాలు వింటున్నప్పుడు— ఇవాళ జ్ఞాపకం చేసుకొంటే— కేవలం సిద్ధాంతాల మీదనే వారిఉపన్యాసాలు ఉండేవి. ఎక్కడా వ్యక్తిగత ద్వేషంగాని, ఉక్రోషంగాని ఏమీ లేదు. ఆ కాలం జ్ఞాపకం చేసుకొంటే

అది సువర్ణయుగం— అని మనకు ఇపుడు అనిపిస్తున్నది; అప్పటికి ఇప్పటికి పోల్చి చూసుకొంటే— మా మిత్రులు లక్ష్మీనరసయ్యగారు చెప్పినట్లు— ఐదుగురు మెజారిటీతో ఐదు సంవత్సరాలు నడిపారు. వెల్లోడి ప్రభుత్వం ఏర్పడే కాలంలో ఆనాడు శాంతిలేదు; భద్రతలు లేవు; లా అండ్ ఆర్డర్ లేదు. వెల్లోడి ప్రభుత్వంలో— వారు, వినాయకరావుగారు, ఫూల్‌చంద్ గాంధీగారు, నేను మేము నలుగురం 1950 లో ప్రవేశించినపుడు— తెలంగాణాలోని గ్రామాలలో ప్రభుత్వం లేదు. భూస్వాములందరు గ్రామాలను వదలిపెట్టారు. గ్రామాలకు ఎవరూ పోయేదిలేదు. ఎవరు పోయినా, పోలీసుతో పోవాలి. అటువంటిది— వారు నేను తెలంగాణాలో పోతున్నప్పుడు— వారి ఉపన్యాసాలు వింటూంటే— అవి ప్రజలను ఆకర్షించేవి. మొట్టమొదట మేము వరంగల్ వెళ్ళగానే అక్కడ మాకు ఒక వార్త వచ్చినది. చిరావూర్వారు లక్ష్మీనరసయ్య, సహదేవపట్నం రామనాథం— ఇద్దరిని పట్టుకొని జైలులో కాల్చేశారు అనగానే (అపుడు నంజప్ప గారు ఉండిరి) నంజప్పగారిని వెంటనే నాముందే పిల్చారు. "నంజప్పా ప్రజా ప్రభుత్వం వచ్చింది: శాసనం ఉండవలెను; ఎవరిని జైలులో కాల్చటంగాని, బజారులో కాల్చటంగాని జరగకూడదు; నేను ఆర్డర్స్ ఇస్తున్నాను; ఇక్కడినుండి మేము ఆ మాటను వినటానికి తయారుగా లేము. లేకపోతే, ప్రభుత్వము వదలిపెట్టి పోతాము; మేము ఖమ్మంమెట్టు చేరేటప్పటికి వారిద్దరు ఎక్కడ ఉన్నారో నాకు వార్త చెప్పాలి" అని అన్నారు. వారు ఇద్దరు రక్షింపబడ్డారు. తర్వాత వారిద్దరిలో ఒకరు మునిసిపల్ చైర్మన్ అయినారు; ఒకరు పార్లమెంట్‌కు పోయినారు. ఆ నాడు వెల్లోడిగారు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వంలో రామకృష్ణరావుగారు ప్రవేశించి— శాంతి భద్రతలకు ఆయన ఏ విధంగా ప్రాతిపదిక వేసుకొని మళ్లీ నార్మాలిటీకి తీసుకురాగలిగినారో; తర్వాత వారి నాయకత్వంక్రింద ఏమి ఎట్లా చేయగలిగామో, ఆలోచించుకొంటే— అదంతా సువర్ణయుగం. అటువంటి స్టేట్స్‌మెన్ మన రాష్ట్రానికే కాదు; మన దేశానికి కావాలి. అజాత శత్రువు అంటే— నిజంగా మహాభారతంలో కథలలో వింటువుతామే గాని— ఆయన ఎపుడూ ఒక మనిషి యొక్క హృదయానికి ఇబ్బంది కలిగేటట్లుగా మాట మాట్లాడగా నేను వినలేదు. ఆయనను ఎదురుగా తిట్టినప్పటికి విమర్శ చేసినప్పటికీ, ఆయన నవ్వుతూ ఉండేవారు. ఎపుడూ పరుషవాక్యం పలుకలేదు. ఆయనను పేదప్రజానీకం, రైతాంగం చిరకాలం జ్ఞాపకం చేసుకోవాలి. హైదరాబాద్‌లో భూసమస్యలు పరిష్కారం చేయటానికి తీసుకువచ్చిన శాసనం, వారియొక్క మేధాశక్తి వల్లనే వచ్చింది. తెల్లవారుఝామున నాలుగు గంటలవరకు కూర్చుని చర్చించేవారు. ఎందుకంటే అప్పుడు కాన్ఫిడెంగ్

ఇంటరెస్ట్ ఉండెను; ఆ రోజుల్లో. ఇవాళ ఏదైనా పని చేయటానికి అవకాశం ఉన్నది. ఇవాళ వాతావరణానికి, ఆ రోజు వాతావరణానికి ఆకాశానికి భూమికి మధ్య ఉన్నంత భేదం ఉంది. అపుడు ఉన్న మత కలహాలుగాని, భాషా విభేధాలుగాని— ఆ వాతావరణం అటువంటిది. ఇదే అసెంబ్లీలో, ఇక్కడ ఆరు భాషలలో చర్చలు జరుగుతుండేవి. ఎవరూ ఒకరినొకరు ద్వేషించుకొనే టటువంటి పరిస్థితియే లేకుండా ఉన్నది. మహమ్మదీయులకుగాని, ఇతర భాషల వారు ఈ పట్టణంలో జీవిస్తున్న వారికిగాని— ఎవరికైనా ఇది నా రాష్ట్రం కాదు; నా పట్టణము కాదు; నేను పరాయివాడిని అనే భావం రాకుండా, అటువంటి వాతావరణాన్ని కాపాడినారు. అదే సాంప్రదాయాన్ని, వాతావరణాన్ని యీ పట్టణంలో యీ ప్రాంతంలో కాపాడవలెనని— ఆయనతో పనిచేసి ఇపుడు ఇక్కడ ఉన్న మన హృదయాలలో నాటిపోయిఉన్నది. రామకృష్ణారావుగారి పేరిట మనం ఎన్ని కార్యక్రమాలు భవిష్యత్‌లో చేసినప్పటికీ— అది కొరతగానే ఉంటుందని భావిస్తున్నాను. ఇవాళ మనకు ఉన్నటువంటి శాంతి భద్రతలుగాని ఇంత పెద్ద రాష్ట్రంగాని— యీ ప్రసాదం అంతా వారిది. మనం ఇది వారి వల్లనే యీ రోజు అనుభవిస్తున్నాము.

ఇవాళ నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోకల్లా పెద్ద ప్రాజెక్టు అని చెప్పుకుంటున్నాము. భారతదేశంలో ఆహార కొరతను తీర్చేటటువంటి ఆ ప్రాజెక్టు నిర్మాణం యొక్క చరిత్రను జ్ఞాపకంచేసుకుంటే ఎటువంటి ఘట్టాలను మనం దాటివచ్చినామో! ఆలీ నవాజ్ జంగ్‌గారి రిపోర్టులో ఆ ముక్క ఉంది. అప్పుడు ఆంధ్రరాష్ట్రం లేదు. 1950, 51, 52 లో మద్రాసు రాష్ట్రంలో పైన ఎక్కడో సోమశిల, సిద్ధేశ్వరం ఆ ప్రాజెక్టులు దృష్టిలో ఉండె. అటువంటి సందర్భంలో cabinet లో ఈ విషయం తీసుకొన్నప్పుడు, Planning Commission లో వి. టి. కృష్ణమాచారిగారు ఉండిరి. వారు లేరు యిప్పుడు చరిత్ర జ్ఞాపకం చేసుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. వారు అడ్డంకులు పెట్టినప్పుడు శ్రీమతి దుర్గాబాయ్‌గారు ఢిల్లీనుంచి ఉత్తరం వ్రాసినప్పుడు cabinet లో ఒక తీర్మానం చేయించారు. ఆ తీర్మానమే నందికొండ ప్రాజెక్టు. అప్పుడు నందికొండ ప్రాజెక్టు అనేవారు. దానితోనే మొదలుఅయింది. ఈ ప్రాజెక్టు వచ్చి తీరాలిఅని గట్టి పట్టు పట్టారు. హైదరాబాద్ రాష్ట్రంలో డబ్బులేదు. తుంగభద్రప్రాజెక్టుకు డబ్బులేక రామగుండం power station లో రెండు జనరేటర్‌లు ఊరికే పడిఉంటే వాటిని అమ్మి డబ్బు తెచ్చుకుందాము అనుకున్న రోజులలో ఈ నందికొండ ప్రాజెక్టుకోసం వారు అమోఘమైన కృషి చేశారు. ఇవన్నీ ఎన్నో ఘట్టాలు ఉన్నాయి. అటువంటి గొప్ప Statesman, an intellectual

politician, అజాతశత్రువు అని నేను మరీ మరీ చెపుతాను. ఆయనను కోల్పోయినందుకు మనం దుఃఖించవలసిందే. ఎంత మనం దుఃఖాన్ని పోగొట్టుకోవాలి అన్నప్పటికి సాధ్యం కాదు. ఉదయం ఆరు గంటలకు వారి యింటికి పోయి చూస్తే వారి ముఖంలో ఏమి మార్పులేదు. 1950 వ సంవత్సరంలో ప్రభుత్వంలో చేరిన దగ్గరనుంచి యివ్వాళ ప్రభుత్వంలో లేకపోయినప్పటికి కూడ ఆయన యందు ఉండే గౌరవం ప్రజలకు గాని ఎవరికైనా గాని అంతే ఉన్నది. అయనలో ప్రజాభిమానం అంతే ఉన్నది. రాజకీయంలో ఒక consistency చూడండి. ఆయన ఎప్పుడూ పార్టీలు మార్చినవాడు కాదు. అధికారం కోసం వక్రమార్గాలు త్రొక్కినవాడు కాదు. ఆయనను గురించి మనం ఒక్కొక్కటి జ్ఞాపకం చేసుకుంటే నిజంగా విద్యా బోధనగా ఉంటుంది. వారి యొక్క ఆత్మ శాంతికి మనం ఎప్పుడూ ప్రార్థిస్తూ ఉందాము. చాలవరకు he is a complete man; his life is complete life. ఆయన వదలిపోయిన పని ఏదైన ఉన్నట్లయితే అది పూర్తి చేస్తే వారి ఆత్మకు యింకా ఎక్కువ శాంతిని కలిగించిన వాళ్ళం అవుతామని నేను మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :— గౌరవసభ్యులారా, పెద్దలు రామకృష్ణరావుగారి మరణాన్ని గురించి ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై ముఖ్యమంత్రిగారు పలువురు సభ్యులు వ్యక్తపరచిన అభిప్రాయాలతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. నేను మొట్ట మొదటి సారిగా రామకృష్ణరావు గారిని 1955 వ సంవత్సరంలో వారు కర్నూలు వచ్చి, గోపాలరెడ్డిగారు అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, మునిసిపల్ high school భవనంలో వారు ఉపన్యసించినప్పుడు చూడగలిగాను. తరువాత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పుడప్పుడు వారిని నేను చూస్తూనే వచ్చాను గాని వారితో నాకు పరిచయ భాగ్యం కలగలేదు. నేను ఈ సభా అధ్యక్ష పదవికి 1962 సంవత్సరంలో ఎన్నికైన తరువాత వారిని అప్పుడప్పుడు కొన్ని సమావేశాలలో కలుసుకోవడం తటస్థిస్తూ వచ్చినది. వారిని నేను ఎప్పుడు కలుసుకొన్నప్పటికీ నన్ను ఎంతో అప్యాయతతో ప్రేమతో దగ్గరకుతీసి ఎంతో చనువుతో మాట్లాడుతూ వచ్చారు. వారితో నాకు పరిచయం లేనప్పటికి కూడ వారిపై నాకు భక్తి గౌరవం ఏర్పడ్డది. నేను పర్యటనకుపోయి 9 వ తారీఖు రాత్రి వచ్చాను. 10 వ తారీఖు సాయంత్రం వారి యింటికిపోయి చూడవలెనని అనుకున్నాను. వారి ఆరోగ్యాన్ని గురించి విచారించాను. వైద్యుల సలహాలవల్ల నన్ను లోపలకు పోనివ్వలేదు చూడనివ్వలేదు. నేను విచారించాను. వారి తమ్మునితో మాట్లాడాను. కోలుకుంటున్నారు. నెమ్మదిగా ఉన్నది. నిద్ర పోతున్నారు

అని చెప్పారు. నేను తిరిగి వచ్చాను. వారి ఆరోగ్యం కోలుకొని యింకా కొన్ని సంవత్సరాల పాటువారు జీవించి ఉండి దేశానికి సేవ చేస్తారు అని ఆశించాను గాని వారు ఈ రోజు అకస్మాత్తుగా చనిపోయారు. నిజంగా మన దురదృష్టం అని అనుకుంటున్నాను. దేశానికి ఒక విధమైనా తీరనిలోటు అని నేను భావిస్తున్నాను. ఒక సుప్రసిద్ధ దేశభక్తుడు, దైవభక్తుడు ప్రతిభాశాలి, పండితుడు, పరిపాలనా దక్షుడు ఉదాత్తమైన ఆశయాలతో ఉదారమైన భావాలతో మన రాష్ట్రానికే గాక, దేశానికే గాక భారత జాతికే గాక, మానవ జాతికి అమోఘమైన సేవ చేశాడు అని నేను భావిస్తున్నాను. వెంకటనారాయణగారు చెప్పినట్లు రామకృష్ణరావుగారు అస్తమించారు. వారిని మనం యిక చూడబోము. కాని వారు జీవితంలో సాధించిన సత్కార్యాలు సజీవంగా ఉండి కేవలం భారతీయులనే కాకుండా మానవ జాతిని ఉత్తేజపరచి సజీవంగా ఉంటాయి. మానవ జాతి తరించడానికి కూడ ఒక విధంగా వారు సాధించిన సత్కార్యాలు మార్గదర్శకంగా ఉంటాయని భావిస్తున్నాను. భగవానుడు వారి ఆత్మకు శాంతి నొసంగుగాక ! గౌరవసభ్యులు వారి గౌరవార్థం రెండు నిముషాల సేపు నిలుచోవాలని కోరుతున్నాను.

The question is :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri B. Ramakrishna Rao, former Chief Minister of Hyderabad and conveys its deep sense of sympathy to the Members of the bereaved family."

The motion was adoped *nem can* all members standing in silence for two minutes.

Mr. Speaker :—The House is adjourned for one hour as a mark of respect to the memory of Sri B. Ramakrishna Rao. The House will meet again at 11-18 a. m. today.

(The House then adjourned till 11-18 a. m.

[ The House re-assembled at 11-18 a. m. ]

(Mr. Speaker in the Chair).

Mr. Speaker :—I am to announce to the House that all questions posted for to-day will be taken up on the 20 th, i.e., Wednesday. The House now further stands adjourned till 8-30 a. m. tomorrow morning as a mark of respect to the memory of late Sri B. Ramakrishnarao.

The House then adjourned till Half past Eight of the clock on Saturday, the 16th September, 1967.